JAYABHERIDAILY.COM

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి | మంగళవారం 02-06-2026

Medchal - Malkajgiri | Tuesday 02-06-2026

Follow: jayabherinews

సంపుటి : 03 | సంచిక : 01

పేజీలు : 8 | వెల : 5

Vol. 03 | Issue 01 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?

సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?

మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!

ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..

డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...

"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889 call me

jayabheripaper@gmail.com






## నా తెలంగాణ కోటి రతనాల వీణ..

## ఒక్కరా.. ఇద్దరా.. నేలకొరిగిన వీరులు...

ఈ రాష్ట్రం కోసం ఎందరో ఆత్మ బలిదానాల ఫలితంగా ఏర్పడ్డ స్వతంత్ర రాష్ట్రం....
నిప్పు అని తెలిసినా ముట్టుకుంటే కాలి బూడిదై పోతారు..
సలసల మరిగే మంటల్లో ఆడుకుందామంటే ఆవిరైపోతారు...
నా తెలంగాణ ఎప్పుడు సరసలు మరిగే నెత్తురు ఉలకలేస్తుంటుంది..
ఆ త్యాగదనుల స్ఫూర్తిగా నేడు 12 వసంతాలు పూర్తి చేసుకుని 13వ సంవత్సరంలోకి
అడుగుపెడుతున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ప్రత్యేక కథనం....

# విపత్తుల సమయంలో ముందు జాగ్రత్తలు



- ఈ సంవత్సరం వర్షపాత పరిస్థితి, ఎల్ నినో ప్రభావం, ఇతర అంశాలపై వాతావరణ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్

జయభేరి, హైదరాబాద్ :

మహారాష్ట్ర, కర్ణాటకల్లోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొనేలా పరిస్థితులు ఉన్నందున అంతరాష్ట్ర జలాల్లో ప్రొరేటా ప్రకారం తెలంగాణకు రావాల్సిన వాటా జలాలు వచ్చేలా ఆయా రాష్ట్రాల అధికారులతో ముందుగానే చర్చించి తగిన కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. మహారాష్ట్రలోని కోయనా డ్యామ్ నీటిని వంద శాతం జల విద్యుదత్పత్తికే మహారాష్ట్ర వినియోగిస్తోందని, ఆ మొత్తం నీటిని మనం తీసుకొని వారికి అవసరమైన విద్యుత్ మనం సరఫరా చేసే అంశంపై ఆ రాష్ట్ర అధికారులతో చర్చించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావును ఆదేశించారు. గోదావరి నది నుంచి ఏటా వేల టీఎంసీల జలాలు సముద్రంలోకి వృధాగా పోతున్నాయని, వరద కూడా చాలా స్వల్ప కాలంలోనే వస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఇటు గోదావరి, అటు ప్రాణహితల వైపు నుంచి వచ్చే వరదను ఎలా మళ్లించాలనే దానిపై స్పష్టమైన విధానం రూపొందించాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌ల గేట్ల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. డ్యామ్‌ల మెయింటెనెన్స్‌పై వివరాలను అధికారులను ఆరా తీశారు. గతంలో కడెం ప్రాజెక్టులో తలెత్తిన ఇబ్బందులను గుర్తు చేశారు. గేట్ల మరమ్మతులు, మెయింటెనెన్స్‌లకు సంబంధించి ఇప్పటికే రూ. 300 కోట్లు విడుదల చేశామని ఆర్థిక శాఖ అధికారులు తెలిపారు. ధిులు ఎన్ని అవసరమైనా వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. ఈ వర్షాకాలంలో ఎక్కడైనా డ్యామ్‌ల విషయంలో ఇబ్బందులు తలెత్తితే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. వాతావరణ శాఖ అంచనాలు, నివేదికలకు అనుగుణంగా పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. పంటల మార్పిడి, పంటల వైవిధ్యత, తక్కువ నీరు వినియోగించుకునే పంటలు, పంట రకాల సాగుపై రైతులకు రైతు వేదికల ద్వారా అవగాహన కల్పించాలని చెప్పారు.

...మిగతాది 2 లో

ఎల్‌నినో ప్రభావంతో వర్షా భావ పరిస్థితులు నెలకొంటాయని వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ వాటా జలాలు దక్కేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎగువ రాష్ట్రాలు డ్యామ్‌లు నిండిన తర్వాతే నీళ్లు వదిలే విధానాన్ని పాటిస్తే మనకు ఇబ్బందులు ఎదురవుతాయని అధికారులను అప్రమత్తం చేశారు. వర్షా కాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో తీసుకోవలసిన ముందస్తు చర్యలపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. సమావేశంలో వ్యవసాయ, నీటి పారుదల, పట్టణాభివృద్ధి, పంచాయతీ రాజ్, ఆరోగ్య, హోం, హైడ్రా, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## జయశంకర్ విగ్రహం పెట్టడానికి అనుమతి ఇవ్వండి

- ఆగస్టు 6న రాబోయే ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి నాటికి విగ్రహ ఏర్పాట్లు పూర్తయ్యేలా ప్రభుత్వం తక్షణమే స్పందించి.. తగు అనుమతులు మంజూరు చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్

జయభేరి, హైదరాబాద్, జూన్ 1 :

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ కాంస్య విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై అధికారికంగా ప్రతిష్టించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. స్వరాష్ట్రం సిద్ధించి 12 ఏళ్లు గడుస్తున్నా.. ప్రభుత్వం ఆయన అధికారిక విగ్రహాన్ని ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ట్యాంక్ బండ్ యుద్ధ ట్యాంకర్ పక్కన విగ్రహ ఏర్పాటుకు అనుమతిస్తే.. పూర్తి నిధులు, గ్రీనరీ నిర్వహణ బాధ్యతలను తెలంగాణ జాగృతి సంస్థే భరిస్తుందని చెప్పారు. ఆగస్టు 6 జయంతి నాటికి దీనిని పూర్తి చేయాలని లేఖలో కోరారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం, ఇక్కడి ప్రజల సమస్యల పరిష్కారం కోసం తన జీవితాంతం ఉద్యమ భావజాల వ్యాప్తి చేసిన మహోన్నత దార్శనికుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్‌కు హైదరాబాద్‌లో తగిన గౌరవం

...మిగతాది 2 లో

## ప్రధాని మోదీతో మయన్మార్ దేశాధినేత భేటీ


- చైనాకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా భారత్ వ్యూహాత్మక అడుగులు!
- ఆగ్నేయాసియాలో చైనా యొక్క పెరుగుతున్న ప్రభావాన్ని అడ్డుకుంటూ, భారత్-మయన్మార్ మధ్య దౌత్య సంబంధాలను పునర్నిర్మించడంలో ఈ భేటీ అత్యంత కీలకమైనదిగా అంతర్జాతీయ నిపుణులు భావిస్తున్నారు.



జయభేరి, న్యూఢిల్లీ:

భారత పర్యటనలో ఉన్న మయన్మార్ సైనిక పాలనా విభాగం (జుంటా) అధినేత, ఆ దేశ అధ్యక్షుడు 'మిన్ ఆంగ్ హ్లైంగ్' సోమవారం దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఐదు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం ఆయన భారతదేశానికి వచ్చారు. ఆగ్నేయాసియాలో చైనా యొక్క పెరుగుతున్న ప్రభావాన్ని అడ్డుకుంటూ, భారత్‌మయన్మార్ మధ్య దౌత్య సంబంధాలను పునర్నిర్మించడంలో ఈ భేటీ అత్యంత కీలకమైనదిగా అంతర్జాతీయ నిపుణులు భావిస్తున్నారు. మయన్మార్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చివేసి సైన్యం అధికారాన్ని చేజిక్కించుకున్న ఐదేళ్ల తర్వాత.. ప్రాంతీయంగా ఆ దేశంతో తిరిగి సంబంధాలను పునరుద్ధరించుకోవడానికి భారత్ ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగానే ఇరు దేశాల నేతలు భద్రత, ప్రాంతీయ అనుసంధానత వంటి పలు కీలక అంశాలపై చర్చలు జరపనున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో మయన్మార్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మిన్ ఆంగ్ హ్లైంగ్ చేపట్టిన మొట్టమొదటి విదేశీ పర్యటన ఇదే కావడం విశేషం. గత కొన్ని ఏళ్లుగా అంతర్జాతీయంగా ఎదుర్కొంటున్న దౌత్యపరమైన ఒంటరితనం

...మిగతాది 2 లో



## కత్తులు, కటార్లతో వస్తే చూస్తూ ఊరుకోం

- తునిలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు నాయుడు వైఎస్సార్సీపీపై నిప్పులు చెరిగారు

జయభేరి, విజయవాడ, జూన్ 1 :

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో సాగింది. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలోని చామవరం గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజా వేదిక సభలో ముఖ్యమంత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైఖరిపై మరియు నంద్యాలలో జరిగిన వైఎస్సార్ విగ్రహ ధ్వంసం ఉదంతంపై నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో అరాచకాలు సృష్టిస్తాం, కత్తులు, కటార్లు తీసుకొస్తాం అంటే చూస్తూ ఊరుకోవడానికి ఇక్కడెవరూ సిద్ధంగా లేరు.. గుర్తు పెట్టుకోండి ఇక్కడున్నది సీబీఎన్ అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిపక్షానికి గట్టి హెచ్చరిక జారీ చేశారు. రాష్ట్రంలో ఇప్పుడు ఉన్నది సామాన్య ప్రభుత్వం కాదని, కేంద్ర, రాష్ట్రాల్లో తిరుగులేని బలమున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వమని గుర్తు చేశారు. ఓ వైపు తాను , మరోవైపు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఇంకోవైపు దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నారని.. ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తూ, శాంతిభద్రతలకు భంగం వాటిల్లేలా ఎవరి ఆటలు

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## విపత్తుల సమయంలో ముందు జాగ్రత్తలు

ఈ విషయంలో ఏఐ టెక్నాలజీతో రూపొందించిన వీడియోలను ప్రదర్శించాలని అన్నారు. టీవీ ఛానెళ్లలోనూ ఇందుకు సంబంధించిన ప్రసారాలు అయ్యేలా చూడాలని ఆదేశించారు. పంటల సాగుతో పాటు అవసరమైన విత్తనాలు, ఎరువుల సరఫరాలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. రామగుండం ఫ్యాక్టరీ నుంచి ఉత్పత్తి అయ్యే యూరియా అంతా తెలంగాణకే కేటాయించేలా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గతేడాది వరదల సమయంలో కామారెడ్డి, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించిన సమయంలో ఇచ్చిన హామీల అమలు వివరాలను అధికారులను ముఖ్యమంత్రి ప్రశ్నించారు. వరద సందర్భంగా ఇచ్చిన హామీలు, ప్రస్తుత పరిస్థితి, ఏవైనా పెండింగ్ లో ఉంటే అందుకు కారణాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. హామీల అమలులో నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. విపత్తుల సమయంలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం వాటిల్లినప్పుడు తక్షణమే అధికారులు స్పందించాలని సూచించారు. వడగాలులు, వరదల సమయంలో ప్రజలు ప్రాణాలు, ఆస్తులు కోల్పోయినప్పుడు వెంటనే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి బాధిత కుటుంబాలకు పరిహారం అందేలా చూడాలన్నారు. వరదల సమయంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు, కూలిన వంతెనల స్థానంలో నూతన వంతెనల నిర్మాణం, ఇతర పనులకు విపత్తు నిర్వహణ శాఖ వద్ద ఉన్న రూ. 1000 కోట్లను నిబంధనల ప్రకారం ఖర్చు చేయాలని చెప్పారు. క్యూర్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో వర్షాకాలంలో రోడ్లపై వరద నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. నీరు నిలిచే 141 ప్రదేశాలను గుర్తించి వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ నిర్మించాలని గతంలో నిర్ణయించామని, వాటి పురోగతిపై వివరాలను అడిగారు. పెండింగ్ లో ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని, వాటి పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని సీనియర్ అధికారి జయేశ్ రంజన్ ని ముఖ్యమంత్రి ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రంలో ఏ ప్రాంతాలోనూ తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ వర్షాకాలానికి అవసరమైన సామగ్రిని ముందుగానే సమీకరించుకోవాలని సూచించారు. గాలి, దుమ్ము, భారీ వర్షాల పడిన సందర్భాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నపుడు, లైన్లు తెగిపోయి సరఫరా నిలిచినప్పుడు తక్షణమే స్పందించి మరమ్మతులు పూర్తి చేసి సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. జిల్లాల స్థాయిలో కలెక్టర్లు, ఎస్పీలు నిర్ణీత సమయంలో భేటీ అవుతూ ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. కలెక్టర్లు, ఎస్పీలు సమన్వయంతో ముందుకు సాగితే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

## ప్రధాని మోదీతో మయన్మార్ దేశాధినేత భేటీ

నుండి బయటపడాలని మయన్మార్ చూస్తుండగా.. అటు మయన్మార్‌పై చైనాకు ఉన్న విపరీతమైన పట్టును తగ్గించి, ఆ దేశంలో ఉన్న అత్యంత విలువైన రసాయన ఖనిజాల నిల్వలను పొందేందుకు భారత్ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని భావిస్తోంది. దీనికి ముందు, ఆదివారం నాడు మయన్మార్ అధ్యక్షుడు భారత జాతీయ భద్రతా సలహాదారు (NSA) అజిత్ దోవల్‌తో భేటీ అయ్యారు. భారత్‌మయన్మార్ సరిహద్దుల్లో ఎదురవుతున్న ప్రధాన భద్రతా సవాళ్లు, తిరుగుబాటు ముఠాల కదలికలు, అక్రమ వలసలు, సరిహద్దు దాటి జరుగుతున్న మానవ/మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై వీరిద్దరి మధ్య ప్రధానంగా చర్చలు జరిగాయి. అలాగే శనివారం కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా మయన్మార్ అధ్యక్షుడిని కలిసి, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో ఆయన చూపుతున్న సానుకూల వైఖరిని అభినందించారు. మయన్మార్ అధ్యక్షుడు శనివారం బీహార్‌లోని బౌద్ధ పుణ్యక్షేత్రం బోధ్‌గయాకు చేరుకున్నారు. ఆయన వెంట పలువురు క్యాబినెట్ మంత్రులు, సీనియర్ అధికారులు మరియు వ్యాపార ప్రముఖులతో కూడిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఉంది. ఇరు దేశాల మధ్య ఉన్న బహుముఖ సంబంధాలను మరింత బలోపేతం చేయడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. ఈ పర్యటన వెనుక ఉన్న అతిపెద్ద కారణాలలో చైనా ఒకటి. ఈ ప్రాంతంలో చైనా ఎదుగుదలకు అడ్డుకట్ట వేయడానికి మయన్మార్‌ను భారత్ ఒక వ్యూహాత్మక పొరుగుదేశంగా చూస్తోంది. ముఖ్యంగా వాణిజ్యం, మౌలిక సదుపాయాలు, రవాణా కనెక్టివిటీ మరియు వ్యూహాత్మక వనరులను పంచుకోవడంలో సహకారాన్ని విస్తరించడానికి భారత్ ఆసక్తి చూపుతోంది.

భారత్‌మయన్మార్ దేశాలు సుమారు 1,600 కిలోమీటర్ల పొడవైన సరిహద్దును పంచుకుంటున్నాయి. సరిహద్దుల్లో శాంతిభద్రతలను కాపాడటానికి, ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాల్లో అలజడులు సృష్టించే తిరుగుబాటు గ్రూపులను అణచివేయడానికి మయన్మార్ సహకారం భారత్‌కు చాలా అవసరం. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత ఆంగ్ సాన్ సూకీ నేతృత్వంలోని ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని సైన్యం పడగొట్టడంతో మయన్మార్‌లో మిలిటరీకి వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసనలు జరిగాయి. దీనివల్ల అంతర్జాతీయంగా ఒంటరైన మయన్మార్‌కు కూడా భారత్ మద్దతు ఇప్పుడు ఎంతో కీలకంగా మారింది.

## కత్తులు, కటార్లతో వస్తే చూస్తూ ఊరుకోం

సాగనివ్వబోమని, ఈ విషయాన్ని రాసి పెట్టుకోవాలని ఆయన ధ్వజమెత్తారు.

నంద్యాల విగ్రహంపై దాడి.. సాక్షిపై మండిపాటు

నంద్యాలలో వైఎస్సార్ విగ్రహంపై జరిగిన దాడి ఉదంతాన్ని చంద్రబాబు నాయుడు ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఖరిని ఎండగట్టారు. నంద్యాలలో వైఎస్సార్ విగ్రహంపై దాడి చేసింది సాక్షాత్తూ వైఎస్సార్సీపీ కార్యకర్తేనని, దానికి ఆ పార్టీ స్థానిక నేతే సపోర్ట్ చేశాడని క్షేత్రస్థాయి ఆధారాలతో సహా బయటపడిందన్నారు. మరి ఈ నిజం సాక్షి పేపర్‌లో ఎందుకు వార్తగా రాలేదు అని చంద్రబాబు నిలదీశారు. రాజకీయ లబ్ధి కోసం, కూటమి ప్రభుత్వంపై బురద జల్లడం కోసమే స్వయంగా ఈ డ్రామాలకు తెరలేపారని ఆరోపించారు. నీ సొంత నాన్న విగ్రహాన్ని నీ పార్టీ వాళ్లే ధ్వంసం చేసినా పేపర్‌లో వేయవు.. ఎందుకంటే ఆ పని వెనుక ఉన్నది నువ్వే, ఆ దాడిని నువ్వే చేయించావు కాబట్టి అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం చామవరంలో పేదలో సేవలో కార్యక్రమంలో పాల్గొన్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

గత ఐదేళ్ల అరాచక పాలనకు ప్రజలు ఎన్నికల్లో చరమగీతం పాడారని, అయినా ప్రతిపక్ష నేతల్లో మార్పు రాకపోవడం విచారకరమని చంద్రబాబు అన్నారు. శాంతిభద్రతలను కాపాడటంలో కూటమి ప్రభుత్వం రాజీ పడబోదని, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా చట్టం ముందు నిలబడాల్సిందేనని స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ నేతలు కల్పిత అల్లర్లను సృష్టించి రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీయాలని చూస్తున్నారని, ఇలాంటి కుట్రలను ప్రజలే తిప్పికొడతారని పిలుపునిచ్చారు.

నెల ఒకటో తేదీనే రూ. 2,721 కోట్ల పెన్షన్లు

సంక్షేమంపై తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని చంద్రబాబు వివరించారు. లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా ప్రతి నెల ఒకటో తేదీనే రూ. 2,721 కోట్ల నిధులను సిద్ధం చేసి నిరుపేదలకు పెన్షన్లు అందిస్తున్నామని చెప్పారు. తుని పర్యటనలో భాగంగా వృద్ధులు, వికలాంగుల ఇళ్లకు నేరుగా వెళ్లి పెన్షన్ అందజేసి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలను పారదర్శకంగా, లబ్ధిదారుల దరికే చేర్చేలా తమ పరిపాలన సాగుతుందని సీఎం హామీ ఇచ్చారు. రాజకీయ కక్షసాధింపులకు తావులేకుండా, రాష్ట్ర పునర్నిర్మాణమే ధ్యేయంగా పవన్ కళ్యాణ్, నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలబెడతామని నమ్మకం వ్యక్తం చేశారు.

# నా తెలంగాణ కోటి రతనాల వీణ..

## ఒక్కరా.. ఇద్దరా.. నేలకొరిగిన వీరులు...

- ఈ రాష్ట్రం కోసం ఎందరో ఆత్మ బలిదానాల ఫలితంగా ఏర్పడ్డ స్వతంత్ర రాష్ట్రం....
- నిప్పు అని తెలిసినా ముట్టుకుంటే కాలి బూడిదై పోతారు..
- సలసల మరిగే మంటల్లో ఆడుకుందామంటే ఆవిరైపోతారు... నా తెలంగాణ ఎప్పుడు సరసలు మరిగే నెత్తురు ఉలకలేస్తుంటుంది..
- ఆ త్యాగదనుల స్ఫూర్తిగా నేడు 12 వసంతాలు పూర్తి చేసుకుని 13వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ప్రత్యేక కథనం....



జయభేరి, హైదరాబాద్ :

1969 తొలి తెలంగాణ ఉద్యమం పురుడు పోసుకొని 600 మందిని బలి తీసుకున్న నాటి చరిత్రకు మళ్ళీ స్వీకారం చుడుతూ.. 2001 ఏప్రిల్ 27న మలిదశ తెలంగాణ ఉద్యమం రూపుదిద్దుతుంది. ఆనాటి పెద్ద మనుషుల ఒప్పందం తొలి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపుకొని ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాల ఆచరణాత్మక సాక్షిగా అడుగులు ముందుకు వేసింది.. మహాకవి కాలోజీ అక్షరం సాక్షిగా తెలంగాణ అణువణువు నా కవిత్వం ఏరులై పారింది... మలిదశ తెలంగాణ ఉద్యమంలో దాదాపు 1300 మంది ఆత్మ బలిదానాలు చేసుకుని తెలంగాణను స్వతంత్ర రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని నినదించి తమ ప్రాణాన్ని త్యాగం చేసిన అమరవీరుల త్యాగ ఫలితమే స్వతంత్ర తెలంగాణ....

వాడెవడు తెలంగాణ డిక్షనరీలో లేదు అని అంటే అగ్గిల మీద గుగ్గిలమై అనువ నువ్వు నా చీల్చి చెండాడింది నా తెలంగాణ... పరాయి రాష్ట్రం తెలంగాణ వస్తే 11 రోజులు ఉపవాసం ఉంటా అని చెప్పిన ఆ పార్టీ మల్ల ఇప్పుడు స్వతంత్ర తెలంగాణలో జనసేన పేరుతో ముందుకు వస్తుంది.... ఒంటరిగా పోటీ చేస్తే ఒక్క సీటు గెలవలేని ఆ జనసేన ఇప్పుడు కూటమి పేరుతో తెలుగుదేశం బిజెపిని వెంటబెట్టుకుని తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ అధికారం చేజిక్కించుకోవడానికి 12 సంవత్సరాలు ఓపిక పట్టి మళ్ళీ ఆంధ్ర పెత్తనం పంజా విసరడానికి తెలంగాణ రాష్ట్రంలోకి అడుగుపెడుతోంది. యువత మేలుకో నీ దేశాన్ని ఏలుకో అన్న స్వామి వివేకానంద సూక్తి సాక్షిగా తెలంగాణ యువత మేధావులు మళ్లీ ఒక్కసారి తెలంగాణ రాష్ట్రం కోసం అస్తిత్వం కాపాడుకోవడానికి మరొక ఉద్యమాన్ని చేయక తప్పదేమో...

12 వసంతాలు పూర్తి చేసుకున్నామని సంబరపడే లోపే మళ్ళీ పరాయి రాష్ట్రం పంజాబీ విప్పుతూ తెలంగాణ రాష్ట్రంపై బుసలు కొడుతోంది... సరే సరే మరి నెత్తురు ఏరులై యువకుల్లో పారుతున్న ఈ సందర్భంలో మరొక్కసారి ఆంధ్ర కూటమి తెలంగాణ అస్తిత్వంపై ఉత్తర సంస్కృతి సాంప్రదాయాలను దక్షిణ భారతదేశంలో అంటే మన రాష్ట్రంపై రుద్దాలని చూస్తోంది.. తెలంగాణ నాలుగున్నర కోట్ల జనుల ధ్వనితో గర్జిస్తే ఆంధ్ర వలస పెత్తందారులు ఆ శబ్దానికే గుండె లాగిపోయేలా మరొక్కసారి ఉద్యమాన్ని ఉధృతం చేయక తప్పదు... తెలంగాణ ఎవ్వడో దానంగా ఇవ్వలే... నిలబడి కలబడి పోరాడి తెగించి ఉద్యమం తోని సాధించుకున్న తెలంగాణ... భారతదేశంలో 29వ రాష్ట్రంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం ఆర్టికల్ 3 సాక్షిగా స్వతంత్ర తెలంగాణగా ఏర్పడింది... రాష్ట్ర ఆవిర్భావం రోజున కచ్చితంగా కేసీఆర్ త్యాగాలను పోరాటాన్ని ప్రతి ఒక్కరు యాది పెట్టుకోవాల్సిందే... పోరాటానికి ఊపిరి పోసి నాయకత్వం వహించి తెలంగాణ రాష్ట్రాన్ని కల సహకారం అయ్యేలా చేసింది మాజీ సీఎం కేసీఆర్... రాష్ట్రాన్ని ప్రకటించింది జాతీయ కాంగ్రెస్ పార్టీ... ఇది నిజం ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా ఇదే సత్యం...

తెలంగాణ రాష్ట్ర ఉద్యమ వీరులారా జాగో.... ఉమ్మడి కూటమి పేరుతో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి జనసేన తెలుగుదేశం పార్టీలు మళ్లీ తెలంగాణ రాష్ట్రంలో అడుగుపెడుతున్నాయి.. ఈ రాష్ట్రం త్యాగాల పునాదులపై ఏర్పడ్డ నిజాన్ని మరిచిపోయిన మన తెలంగాణ బిడ్డలే ఆ జెండాలు మోస్తూ వలసంద్రుల పార్టీలకు బానిసలు అవుతున్నారు... సినిమా హీరోలను నిజమైన హీరోలని భ్రమ పడుతున్నారు.. ఒంటరిగా పోటీ చేస్తే ఒక్క సీటు కూడా రాని ఆ హీరోలు రీల్ హీరోలే తప్ప, రియల్ హీరోలు కాదు... అలాంటి వారి జెండాలకు సలాం కొట్టే తెలంగాణ యువత అసలు నిజాన్ని తెలుసుకోవాలి... నీతోటి అన్నదమ్ములు ఆత్మ బలిదానాలు చేస్తే కానీ మంటల్లో కాలిపోయి ఉరిపోయేలు పెట్టుకొని తుపాకీ తూటాలకు బలి అయిపోతేనే ఈ రాష్ట్రం ఏర్పడిందని తెలుసుకో.... త్యాగదనుల పునాదుల మీద ఈ రాష్ట్రం ఏర్పడిందని ఒక్కసారి నీ గుండెతో నువ్వు మాట్లాడుకో.... అంతేకానీ పరాయి రాష్ట్రపు రాజకీయ పార్టీని నీ గుండెల పై పెట్టుకొని కన్న తల్లి తెలంగాణ రాష్ట్రాన్ని సమాధి చేయకు.. అలా చేయాలని చూస్తే తెలంగాణ సమాజం వాళ్ళని కూడా బొంద పెట్టి మరొక ఉద్యమాన్ని మొదలు పెట్టక తప్పదు... మహాకవి కాలోజీ అన్నట్లుగా పరాయి రాష్ట్రముదైతే తరిమికొట్టు అదే మనవాడైతే బొంద తీసి పెట్టు అన్న నిజాన్ని ఇప్పటికీ తెలంగాణ ప్రజలు మరిచిపోలేదు ఎప్పటికీ మరిచిపోరు. ఈ రాష్ట్రం ఎవడో దానంగా ఇచ్చింది కాదు.. ఈ రాష్ట్రం మన కష్టార్జితం.. ఇక్కడ ఎవడో వచ్చి పెత్తనం చేస్తా అంటే తెలంగాణ ఆత్మగౌరవం ఏం కావాలి..? తెలంగాణ ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెట్టే ఎవ్వడైనా సరే ఉద్యమ ద్రోహులే తెలంగాణ అంటే రాష్ట్ర భక్తి ఉండాలి.. దేశభక్తి ఉంటే సరిపోదు రాష్ట్రం నాది నీది మన అందరిదీ తెలంగాణ గడ్డ మీద పుట్టిన ప్రతి ఒక్క బిడ్డ తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే బాధ్యతను తీసుకోవాలి.... ఆనాడే నిజమైన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుందాం. జై తెలంగాణ అన్న నినాదాన్ని ప్రతి గుండె నిండా బిగబట్టి గర్జిద్దాం.. అమరవీరుల ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ 12 వసంతాలు పూర్తిచేసుకుని 13వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న నా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్న ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం..



కడారి శ్రీనివాస్
జయభేరి సీనియర్ జర్నలిస్ట్,
98489 62799
కవి రచయిత, గాయకుడు,
తెలంగాణ ఉద్యమకారుడు,
గిడుగు రామ్మూర్తి అవార్డు గ్రహీత

## తెలంగాణా ఉద్యమ ప్రస్థానం



మోతె రఘు తిరుపతి రెడ్డి
'జయభేరి' దినపత్రిక ఎడిటర్

దశాబ్దాలుగా (1969 నుండి 2014వరకు) వివిధ దశలలో సాగిన తెలంగాణ ఉద్యమంలో వందలాది మంది ఆత్మహత్యలు చేసుకొన్నారు. ప్రత్యేక తెలంగాణ అంశంపై 2010లో శ్రీకృష్ణ కమిటీ ఏర్పాటై ఆరు ప్రతిపాదనలు చేసింది. ఆ ప్రతిపాదనలతో 2013, జూలై 30న ప్రత్యేక తెలంగాణ కొరకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటి తీర్మానం చేయగా, 2013 అక్టోబరు 3న కేంద్ర మంత్రిమండలి ఆమోదం లభించగా... 2014, ఫిబ్రవరి 18న తెలంగాణ ఏర్పాటు బిల్లుకు భారతీయ జనతా పార్టీ మద్దతుతో లోకసభలో, ఫిబ్రవరి 20న రాజ్యసభ ఆమోదం పొందింది. 2014లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనను ఆదేశిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 (ఆంధ్రప్రదేశ్ విభజన బిల్లు, లేదా తెలంగాణ బిల్లు)ను ప్రవేశపెట్టింది. 2014 మార్చి 1న బిల్లుపై రాష్ట్రపతి ఆమోదం లభించగా, 2014 జూన్ 2వ తేదీన దేశంలో 29వ రాష్ట్రంగా నూతనంగా అవతరించింది. 1988 ఆగస్టు నెలలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ స్టూడెంట్ ఫ్రంట్ (టీఎస్ఎఫ్) ఏర్పడింది. దీనికి కిషోర్‌రెడ్డిని కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. 1994లో అశోకా ఫంక్షన్ హాలులో జరిగిన ఒక సభలో పర్‌స్పెక్టివ్స్ ఆన్ తెలంగాణ డాక్యుమెంటరీని తెలుగులోకి అనువదించి పుస్తకంగా ముద్రించారు. 1996 ఆగస్టు 15న అప్పటి ప్రధానమంత్రి దేవగౌడ ఉత్తరాఖండ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ ప్రకటన దేశంలోని ప్రత్యేక రాష్ట్రాల కోసం ఉద్యమించే సంస్థలకు ఊపిరి పోసింది. తెలంగాణలో పలు జిల్లాల్లో న్యాయవాదులు, విద్యావంతులు అనేక సెమినార్లను నిర్వహించారు. ఈ సెమినార్లకు తెలంగాణ పెద్ద తల కాళోజి నారాయణరావు, డా. కొత్తపల్లి జయశంకర్‌లను ఆహ్వానించి తెలంగాణ ఆకాంక్షను చాటారు. వందల ఏండ్లుగా స్వతంత్ర రాజ్యంగా, స్వతంత్ర దేశంగా ఉన్న తెలంగాణ దక్కన్ పీఠభూమి తనకు తానే స్వతంత్రం కోసం ప్రత్యేక రాష్ట్రం కోరే సుదీర్ఘ పోరాటం చేయడం చరిత్రకే చరిత్ర. 1956 నవంబర్ 1 తెలంగాణకు విద్రోహ దినంగా మారింది. ఆంధ్రప్రదేశ్ అవతరణలో తెలంగాణ అస్తిత్వం ప్రశ్నార్థకమైంది. అదే 2014 జూన్ 2 దాకా నడిచి ఒక సుదీర్ఘ పోరాటం మహా పర్వమైంది. తెలంగాణ చరిత్ర సామాజిక ఉద్యమాలతో మొదలైంది. ఒక మనిషిపై మరో మనిషి ఆధిపత్యం చెలాయించడాన్ని నిరసించిన మానవతా ఉద్యమాలకు ఈ నేల ఊపిరి పోసింది.

## జయశంకర్ విగ్రహం పెట్టడానికి అనుమతి ఇవ్వండి

దక్కడం లేదనే చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. తెలంగాణ ఉద్యమంలో, సాంస్కృతిక పునరుజ్జీవనంలో గత రెండు దశాబ్దాలుగా క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న సామాజిక సంస్థ తెలంగాణ జాగృతి ఈ అంశంపై స్పందించింది. హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక ట్యాంక్ బండ్‌పై జయశంకర్ సార్ కాంస్య విగ్రహాన్ని అధికారికంగా ప్రతిష్టించడానికి అనుమతినివ్వాలని కోరుతూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వానికి ఒక లేఖ రాశారు. తెలంగాణ ఎదుర్కొంటున్న అనేక వివక్షలకు, సమస్యలకు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఒక్కటే ఏకైక మార్గమని నమ్మి పల్లె పల్లెకూ తిరిగి ఉద్యమ ఆవశ్యకతను వివరించిన మహోన్నతుడు జయశంకర్ సార్ అని కవిత కొనియాడారు. వారి స్ఫూర్తితోనే ఇప్పటికే తెలంగాణ జాగృతి సంస్థ నాలుగు జిల్లా కేంద్రాల్లో జయశంకర్ నిలువెత్తు విగ్రహాలను ఏర్పాటు చేసి గౌరవించుకుందని గుర్తుచేశారు. అయితే.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించి 12 ఏళ్లు గడిచినప్పటికీ ఆ మహనీయుని కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం రాజధాని నగరంలో అధికారికంగా ఏర్పాటు చేసుకోకపోవడం అత్యంత దురదృష్టకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 2017 జూలైలోనే ఈ విషయమై జాగృతి తరఫున ప్రభుత్వానికి నివేదించినప్పటికీ ఆశించిన స్పందన రాలేదని పేర్కొన్నారు. మహనీయులను గౌరవించుకోవడం అంటే మన చరిత్రను మనం గౌరవించుకోవడమేనని అందుకే జయశంకర్ సార్ విగ్రహం హైదరాబాద్‌లో కొలువుదీరటం ఒక చారిత్రక అవసరమని లేఖలో స్పష్టం చేశారు. ట్యాంకుబండ్‌పై ప్రస్తుతం యుద్ధ ట్యాంకర్ ఉంచిన స్థలానికి పక్కన ఉన్న ప్రాంగణం ప్రొఫెసర్ జయశంకర్ గారి విగ్రహ ఏర్పాటుకు అత్యంత సముచితమైనదిగా తెలంగాణ జాగృతి ప్రతిపాదించింది. ఈ విగ్రహ స్థాపనకు అయ్యే పూర్తి నిధులను ప్రభుత్వ రూపాయి సహాయం లేకుండా తమ సంస్థే పూర్తిగా భరిస్తుందని కవిత స్పష్టం చేశారు.కేవలం విగ్రహాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా.. భవిష్యత్తులో ఆ విగ్రహ పరిసరాల పర్యవేక్షణ, గ్రీనరీ నిర్వహణ బాధ్యతలను కూడా తామే చూసుకుంటామని ప్రభుత్వం ముందు ప్రతిపాదనలు ఉంచారు. ఇందుకు సంబంధించిన పూర్తి నమూనా ప్లాన్, డాక్యుమెంట్లను కూడా లేఖతో జతపరిచారు. ఈ ఏడాది ఆగస్టు 6న రాబోయే ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి నాటికి విగ్రహ ఏర్పాట్లు పూర్తయ్యేలా ప్రభుత్వం తక్షణమే స్పందించి.. తగు అనుమతులు మంజూరు చేయాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.

## 3 ఉద్యోగాలకు నోటిఫికేషన్

జయభేరి, హైదరాబాద్, జూన్ 1 :



తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2వ తేదీన నిరుద్యోగులకు శుభవార్త చెప్పేందుకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) రెడీ అయింది. ఈ నేపథ్యంలోనే రేపు ఒక్కరోజే 3 రకాల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తాజాగా వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసే ప్రక్రియలో వేగాన్ని పెంచడంతో పాటు.. ఎలాంటి అవకతవకలు లేకుండా పరీక్షల నిర్వహణలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నట్లు ఆయన ప్రకటించారు.ఇక రాష్ట్ర ప్రభుత్వం నుంచి 3,800 ఖాళీ పోస్టుల భర్తీకి అనుమతులు వచ్చినట్లు టీజీపీఎస్సీ ఛైర్మన్ వెల్లడించారు. ఇందులో అటవీ శాఖలో ఖాళీగా ఉన్న 3,093 పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారు. ఇక వివిధ శాఖల్లో ఒక్కో పోస్ట్ చొప్పున 25 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం ఇక నుంచి రెగ్యులర్‌గా నోటిఫికేషన్లను టీజీపీఎస్సీ విడుదల చేస్తుందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే ప్రతీ నెల సగటున 3 నోటిఫికేషన్లను జారీ చేసినట్లు చెప్పారు. ఈ క్రమంలోనే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రేపు 3 కొత్త నోటిఫికేషన్లను రిలీజ్ చేస్తున్నట్లు తెలిపారు.ఇక నుంచి టీజీపీఎస్సీ ఏ ఉద్యోగ నియామక ప్రక్రియ ప్రారంభించినా.. దాన్ని గరిష్ఠంగా ఒక సంవత్సరం లోపే పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఛైర్మన్ బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. అదే సమయంలో ఇక నుంచి టీజీపీఎస్సీ నిర్వహించే అన్ని నియామక పరీక్షలను పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలోనే నిర్వహించనున్నట్లు తేల్చి చెప్పారు. సీబీటీ వల్ల పేపర్ లీకేజీలకు అవకాశం ఉండదని.. పరీక్ష పేపర్‌ను ముందే తయారు చేయడం అనేది కూడా ఇక నుంచి ఉండదని చెప్పారు. ఇక అభ్యర్థులు పరీక్ష రాసిన వెంటనే వారు ఎన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు రాశారో కూడా తెలిసేలా సరికొత్త టెక్నాలజీని తీసుకురానున్నట్లు ఆయన ఒక హింట్ ఇచ్చారు.ఇక టీజీపీఎస్సీ చేపట్టే ఉద్యోగ నియామకాల్లో మొదట నోటిఫికేషన్ విడుదల.. ఆ తర్వాత పరీక్ష నిర్వహణ.. అనంతరం.. మెరిట్ లిస్ట్ రిలీజ్.. చివరిగా సెలక్షన్ లిస్ట్ అనే దశల్లో కచ్చితంగా పారదర్శక విధానాన్ని పాటిస్తామని బుర్రా వెంకటేశం తేల్చి చెప్పారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి లోపాలు లేవు అనే నమ్మకాన్ని అభ్యర్థుల్లో కలిగించడానికే తాము కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.అదే సమయంలో దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికీ ఉద్యోగాలు ఇవ్వడం సాధ్యం కాదని.. వారిలో కేవలం 0.1 శాతం మందికి మాత్రమే ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. జాబ్ రాని వారు టీజీపీఎస్సీపై దుష్ప్రచారం చేయడం సహజమేనని.. అయితే మిగిలిన అభ్యర్థులు వాటిని పట్టించుకోవద్దని సూచించారు. కేంద్ర ప్రభుత్వంలోని యూనియన్ పబ్లిక్ సర్వీసెస్ కమిషన్ (యూపీఎస్సీ) అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలనే తెలంగాణలో అవలంబించనున్నట్లు బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణకు ప్రతిభా భారతి అనే సరికొత్త పద్ధతిని కూడా తీసుకురానున్నట్లు టీజీపీఎస్సీ చైర్మన్ వెల్లడించారు.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఈసారి ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 10 గంటల లోపే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జూన్ 2న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే అధికారిక వేడుకలు ఉదయం 8.30 గంటలకు ప్రారంభం కానున్నాయి. జాతీయ పతాకావిష్కరణతో కార్యక్రమాలు మొదలై గంటన్నరలోపు ముగిసేలా ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అతిథులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, నీడతో కూడిన ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎం ఆదేశించారు.

# అవమానిస్తే తెలంగాణ ఊరుకోదు

**జయభేరి, ఆదిలాబాద్ :**



రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు అధైర్యపడొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. “రైతాంగం వద్ద ఎన్ని క్వింటాళ్ల ధాన్యం ఉన్నా అన్నింటినీ ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. అధైర్య పడొద్దు. తడిచిన ధాన్యానికి కూడా కనీస మద్దతు ధర ఇస్తుంది. ప్రతి గింజా కొంటాం. రెండు రోజులు వెనకాముందు.. ప్రతి గింజా కొంటాం..” అని ధైర్యం చెప్పారు. ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తప్పుబట్టారు. కేవలం మద్దతు ధర ప్రకటించి వదిలేయడం కాకుండా రాష్ట్రంలో పండించిన ధాన్యం కొనుగోలు చేయడంలో కేంద్ర ప్రభుత్వ బాధ్యతను గుర్తుచేశారు. ధాన్యం కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం మిగతా రాష్ట్రాలకు ఇస్తున్న ప్రాధాన్యత తెలంగాణ కు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. రాష్ట్రానికి సంబంధించి అత్యంత కీలకమైన ధాన్యం కొనుగోలు, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వం ప్రదర్శిస్తున్న వైఖరిని ముఖ్యమంత్రి ఎత్తిచూపారు. మహారాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ రెండు కీలక అంశాల్లో కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. అందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పై గురుతరమైన బాధ్యత ఉందని గుర్తుచేశారు. కేంద్రం తెలంగాణ పట్ల వివక్ష ప్రదర్శిస్తే తదుపరి తీసుకోవలసిన చర్యలపై జూన్ 15 తర్వాత కార్యాచరణను ప్రకటిస్తామని చెప్పారు.

“తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత - చేవెళ్ల పూర్తి చేయడం వల్ల ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లోని లక్షలాది ఎకరాలకు నీళ్లిచ్చే అవకాశం ఉంటుంది. ఆదిలాబాద్ అనగానే తుమ్మిడిహెట్టి గుర్తొస్తుంది. ఆ ప్రాజెక్టును చేపట్టడానికి ఏడాది కాలంగా మహారాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడటానికి ప్రయత్నిస్తున్నాం. కానీ మహారాష్ట్ర ముఖ్యమంత్రి గారు స్పందించడం లేదు. రాష్ట్రాల మధ్య చర్చలు సంప్రదింపుల ద్వారా నీటి సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రధానమంత్రి చెబుతున్నారు. అంతరాలు, అవాంతరాలను తొలగించుకోవడానికి సమయం ఇవ్వాలని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ కి లేఖ రాశాం. కానీ మహారాష్ట్ర సీఎం తెలంగాణ పట్ల వివక్ష చూపుతున్నారు. సమస్య పరిష్కరించుకోవడానికి కనీస గౌరవం కూడా పాటించడం లేదు” అని ఆరోపించారు. “నిర్లక్ష్యం చేస్తే, అవమానిస్తే తెలంగాణ ఊరుకోదు. మా బాధను, ఆవేదనను అర్థం చేసుకోండి. ఈ విషయంలో రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి దూతగా వ్యవహరించాలి. ప్రజా ప్రభుత్వానికి బేషజాలు లేవు. పంతాలు పట్టింపులు లేవు అని అన్నారు.

“తుమ్మిడిహెట్టి పూర్తి చేయడానికి మహారాష్ట్రలో 2 వేల ఎకరాల భూ సేకరణ చేయాలి. అందుకు మహారాష్ట్ర అంగీకరించాలి అని పేర్కొంటూ పోలవరం ప్రాజెక్టు కోసం గతంలో తెలంగాణలోని ఏడు మండలాలను ఏపీలో కలిపిన విషయాన్ని ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి విషయాన్ని పదే పదే లేవనెత్తుతున్నా, లేఖలు రాస్తున్నా స్పందించే ప్రయత్నం చేయడం లేదు. మీకు పంచాయతీ కావాలా.. పరిష్కారం కావాలా అంటే మాకు పరిష్కారం కావాలని కోరుకుంటాం. రైతాంగ సమస్యల పరిష్కారమే నాకు కావాలి” అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. “రాష్ట్రంలో ఇప్పటికే 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం. ఇంకా 10 నుంచి 12 లక్షల మెట్రిక్ టన్నులు ఉండొచ్చని అంటున్నారు. 75 లక్షల వడ్లను సేకరించనున్నాం. ధాన్యాన్ని కేంద్రం సేకరించాలి. మిగతా రాష్ట్రాలకు ఇచ్చిన ప్రాధాన్యత తెలంగాణకు ఇవ్వడం లేదు” అని ఆరోపించారు. రాష్ట్రంలో మొక్కజొన్నలు 40 లక్షల టన్నులు పండాయి. కనీస మద్దతు ధర ప్రకటించిన కేంద్రం మన మక్కలు, జొన్నలు, పొద్దుతిరుగుడు కొనుగోలు చేయాలి. కేంద్రం కొనుగోలు చేసేలా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవ తీసుకోవాలి అని కోరారు. “తెలంగాణ రైతులు అనాధలు కాదు. దిక్కులేని వారు కాదు.

తెలంగాణ ప్రజలకు గళమే లేదని అనుకోవద్దు. మహారాష్ట్రతో పరిష్కారం కావాలన్నా, విత్తనాలను, ధాన్యం కొనాలన్నా కేంద్రం ముందుకు రావాలి..” అని ముఖ్యమంత్రి అన్నారు. “గడిచిన 60, 70 ఏండ్లుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నిర్లక్ష్యానికి గురైంది. అంతటి నిర్లక్ష్యానికి గురైన ఆదిలాబాద్ లో సమస్యల పరిష్కారం అంత ఆశామాషీ వ్యవహారం కాదని తెలుసు. కానీ జిల్లా అభివృద్ధి కోసం దృఢమైన సంకల్పంతో ప్రయత్నం చేస్తున్నాం” అని చెప్పారు. “ఆదివాసీ బిడ్డలు కోరేది ఆత్మగౌరవంతో బతకడానికి సొంత ఇండ్లు కావాలని. రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతున్నా పేదవాడి సొంతింటి కల నెరవేర్చకపోతే వృథా. నాగోబా జాతర ఆహ్వానం అందించడానికి వచ్చినప్పుడు పటేళ్లు గూడాల్లో పేదలకు పక్కా ఇండ్లు ఇవ్వాలని కోరారు. అందుకే ఐటీడీఏ ప్రాంతాల్లో 21 వేల అదనపు ఇండ్లను మంజూరు చేశాం. ఇంకా కొంతమంది ఇండ్లు రాలేదని చెప్పారు. ఈ తెలంగాణ రాష్ట్రంలోని తండాలు, గూడాల్లో నూటికి నూరు శాతం ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వాలి. అందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి” అని ముఖ్యమంత్రి వేదిక నుంచి సంబంధిత మంత్రికి ఆదేశాలిచ్చారు.

“పేదోడు గుడిసెలో ఉండొద్దు. పార్టీలకు అతీతంగా వివక్షలేని రాజకీయాలు, వివక్ష లేని సంక్షేమం, అభివృద్ధి చేయాలన్నది మా ఆలోచన. ఈ ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులు గూడాల్లో ఇండ్లు లేని పేదలను గుర్తించాలి. వారికి ఇండ్లు ఇచ్చే బాధ్యత నాది. రాష్ట్రంలో గుడిసెలు లేని గూడాలను చూడాలనుకుంటున్నా. గ్రామ సభలు పెట్టి జాబితాలు సిద్ధం చేయండి. అవసరమైతే నాలుగు రోజులు ఇక్కడే ఉండి గూడాల్లో ఇండ్ల అవసరాలను గుర్తించాలని జిల్లా ఇంచార్జీ మంత్రిని ఆదేశించారు. సంవత్సరం తిరిగేలోపు గూడాల్లో ఒక్క గుడిసె కూడా ఉండటానికి వీలులేదు. అందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలి. తల తాకట్టు పెట్టయినా ఇండ్లు కట్టిస్తాం. పిల్లల ఫీజులు, ఉద్యోగుల పెన్షన్ల వంటి ఎన్ని కష్టాలున్నా ఇందిరమ్మ ఇండ్లకు ఒక్క బిల్లు కూడా ఆపలేదు. వచ్చే సెప్టెంబర్ 17 వ తేదీ 2026 నాటికి రాష్ట్రంలో మరో లక్ష ఇండ్లల్లో గృహప్రవేశాలు చేయడానికి వీలుగా ఏర్పాట్లు చేయాలి” అని మంత్రి పొంగులేటికి చెప్పారు.



# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుందాం

- కుట్రలను ఛేదిద్దాం.. తెలంగాణను కాపాడుకుందాం
- బీఆర్ఎస్ పార్టీ దేవరకద్ర మండల అధ్యక్షుడు జెట్టి నరసింహారెడ్డి

**జయభేరి, దేవరకద్ర :**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం అత్యంత ఘనంగా జరుపుకుందామని, తెలంగాణ వ్యతిరేక కుట్రలను ఛేధించి మన తెలంగాణను కాపాడుకుందామని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జెట్టి నరసింహారెడ్డి అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డ ఈ ప్రతిజ్ఞ చేద్దామన్నారు. ఈనెల ఆత్మగౌరవం, ఆస్తిత్వ రక్షణ కోసం తెలంగాణ సైనికులుగా నిరంతరం పోరాడుదామన్నారు. సుసంపన్నమైన ప్రకృతి సంపద, మహోజ్వల చరిత్ర కలిగిన ఈ పవిత్ర తెలంగాణ నేలపై జన్మించినందుకు ప్రతి ఒక్కరు ఎంతో గర్విస్తున్నారన్నారు. తెలంగాణను ఎల్లవేళలా గుండెల్లో పెట్టి కాపాడు కుందామన్నారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్ నాయకత్వంలో ఎందరో అమరవీరుల త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ దశాబ్ద కాలంలోనే సమగ్ర అభివృద్ధి సంక్షేమాలతో వర్ధిల్లుతుందన్నారు. కానీ ప్రస్తుతం అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన నయవంచక పాలనలో మన రైతాంగం, అన్ని వర్గాల ప్రజలు కష్టాల పాలవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. తెలంగాణ వ్యతిరేక శక్తుల కుట్రల వల్ల మన అస్తిత్వానికి ముప్పువాటిల్లే అవకాశం ఏర్పడిందన్నారు. ఈ విపత్కర పరిస్థితిలో తెలంగాణ ఆస్తిత్వ రక్షణే ప్రథమ కర్తవ్యం గా భావిస్తూ మరో ప్రజా పోరాటానికి పునరంకిత మవుతామన్నారు. దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆదేశంతో మంగళవారం జరిగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి ఒక్కరు ఘనంగా జరుపుకుందామని జెట్టి నరసింహారెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు అధిక సంఖ్యలో హాజరు కావాలని నర్సింహారెడ్డి కోరారు.

# చదివిస్తామని మాట ఇవ్వండి

**జయభేరి, ఆసిఫాబాద జిల్లా :**



"ఉచిత విద్యుత్, ఉచిత బస్సు సౌకర్యంతో పాటు మీకు ఇందిరమ్మ ఇళ్లు, తాగునీరు వంటి సౌకర్యాలన్నీ కల్పిస్తాం. కానీ ప్రతిఫలంగా నేను మీ నుంచి ఆశిస్తున్నది ఒక్కటే..." అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కౌతారి గ్రామ పంచాయతీలోని కొత్తగూడకు చెందిన ఆదివాసీ మహిళలను అడిగారు. ఏం అడుగుతారోనని ఆసక్తిగా వింటున్న మహిళలను.. ముఖ్యమంత్రి గారు అడిగింది ఒక్కటే.. "మీరు ఒక పూట ఉపవాసం ఉన్నా సరే మీ పిల్లలను మాత్రం చదివించాలి అని కోరుతున్నా.. చదివిస్తామని మాట ఇవ్వండి.." అని అడిగారు. కొత్తగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇందిరమ్మ ఇండ్ల సామూహిక గృహప్రవేశ శుభకార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన సమయంలో ఆదివాసీలతో జరిగిన ముఖాముఖి సందర్భంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి ముందుగా రెండో విడతగా రాష్ట్ర వ్యాప్తంగా 2.5 లక్షల ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు సంబంధించి గృహ నిర్మాణ శాఖ ఏర్పాటు చేసిన పైలాన్ ఆవిష్కరించారు. కొత్తగూడ గూడెంలో 25 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి కాగా, గ్రామానికి చెందిన సిడం కన్నీబాయి, టెకం పగ్గుబాయి, ఆత్రం పోచుబాయిలకు చెందిన ఇందిరమ్మ గృహాలను స్వయంగా కుటుంబసభ్యులతో కలిసి ప్రారంభించి పరిశీలించారు. నూతన సాంకేతికతతో నిర్మించిన ఇండ్లను పరిశీలించి ఆదివాసి బిడ్డలకు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి గారి రాక సందర్భంగా ఆదివాసీలు తమ సాంప్రదాయ గుస్సాడి నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు.

గృహ ప్రవేశ శుభవేళ ముఖ్యమంత్రి, మంత్రులకు ఆదివాసీలు సంప్రదాయ పిండి వంటలను రుచి చూపించారు. అనంతరం గ్రామ మహిళలతో ముఖ్యమంత్రి గారు ముఖాముఖి మాట్లాడారు. "మీ పిల్లలు చదువుకోకపోతే మీ జీవితాల్లో మార్పు రాదు. చదువొక్కటే మీ జీవితాల్లో మార్పు తీసుకొస్తుంది. చదువొక్కటే మీ జీవితాల్లో వెలుగులు నింపుతుంది.." అని చెబుతూ వారితో చదివిస్తామన్న మాట తీసుకున్నారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు కేటాయించిన సందర్భంలో ఇవి సరిపోవని చెప్పినప్పుడు గూడాల్లో తండాల్లో, ఐటీడీఏల్లోని ఆదివాసీ ఏ ప్రాంతమైనా అందరికీ ఇండ్లు ఇవ్వాలని 21 వేల ఇండ్లను అదనంగా మంజూరు చేశామని చెప్పారు. ఇండ్లు లేనివారంటూ ఉండరాదన్నది నిర్ణయం. అందుకే రెండో విడతగా రాష్ట్ర వ్యాప్తంగా మరో 2.5 లక్షల ఇండ్లను మంజూరు చేసిన కార్యక్రమాన్ని కూడా ఇక్కడినుంచే ప్రారంభించాం. రాష్ట్రంలోని ఏ గూడెంలోనూ గుడిసె ఉండటానికి వీలులేదు. అన్ని గూడాల్లో పేదోళ్లకు ఇండ్లను మంజూరు చేయాలి. ఏడాది తిరిగేలోగా మళ్లీ ప్రవేశాలు చేసుకుందాం. తండాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి 365 రోజుల్లోగా అందరికీ ఇండ్లు మంజూరు చేయాలి అని అక్కడి నుంచే అధికారులను ఆదేశించారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. ఉచిత కరెంట్ ఇస్తున్నాం. ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నాం. మహిళా సంఘాలకు అందించే రుణాలను 5 లక్షల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచాం. ప్రజా ప్రభుత్వం మహిళల అభ్యున్నతిని ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటున్నాం. అందరికీ ఇండ్లు ఇస్తాం. అందరూ సంతోషంగా ఉండాలి. ఇండ్లు తీసుకున్న వారెవరూ వాటి నిర్మాణాన్ని మధ్యలో ఆపొద్దు.. అని ముఖ్యమంత్రి కోరారు.

# పేదల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యం

- ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట:**



పేద ప్రజల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. సోమవారం యాదగిరిగుట్ట పట్టణంలోని ఆరో వార్డులో నిర్మించిన రెండు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలలో అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి పట్టువస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బీర్ల అయిలయ్య మాట్లాడుతూ పేద ప్రజలకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే లక్ష్యంతోనే సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రజాపాలన కొనసాగుతుందని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలన్ని ప్రజలకు అందజేస్తున్నామన్నారు. ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి భద్రత, ఆత్మగౌరవానికి ప్రతీక అని, ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని ప్రధాన ధ్యేయంగా పెట్టుకుని పనిచేస్తోందన్నారు. ఆలేరు నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, వైస్ చైర్‌పర్సన్ బరిగె రమ్య రాంచందర్, మున్సిపల్ కౌన్సిలర్లు ముక్కెర్ల మల్లేష్‌యాదవ్, బబ్బూరి శ్రీధర్, బూడిద మధు, కాటబత్తిని స్వప్న ఆంజనేయులు, పేరబోయిన సత్యనారాయణ, కర్రె మాధవి, బోడ రాధ, బిట్టు సరోజ, పెలిమెల్లి లావణ్య, కోఆప్షన్ సభ్యులు గౌలీకార్ అరుణ రాజేష్, రహీమా, షరీఫ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు, అధికారులు పాల్గొన్నారు.



# ఆర్యవైశ్య మహిళల పూజలు

- అధికమాసం సందర్భంగా దేవాలయాల సందర్శన

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రానికి చెందిన ఆర్యవైశ్య మహిళలు సోమవారం హైదరాబాద్ బాదులోని వివిధ దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికమాసాన్ని పురస్కరించుకొని వారు ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ లోని పెద్దమ్మ తల్లిని అలాగే ప్రత్యంగిరా దేవి, నిమిషాంబికా దేవి, అష్టలక్ష్మి దేవాలయం, కొత్తపేట అమ్మవారి లను వారు దర్శించుకున్నారు. జేష్ఠ అధికమాసం సందర్భంగా ఆర్యవైశ్య మహిళలు 33 అమ్మవార్లకు ఒడిబియ్యం నింపే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే ఆయా దేవాలయాలను సందర్శించి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. దేవరకద్ర జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణి ఆధ్వర్యంలో దేవతా మూర్తుల ఒడిబియ్యం నింపే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఈ హెచ్ ఎస్ పేరిట మినహాయింపు చేయడం ఎంతవరకు సమంజసం

- ఖండించిన మహబూబ్ నగర్ జిల్లా తెలంగాణ స్టేట్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం

**జయభేరి, దేవరకద్ర :**

ఉద్యోగుల మే నెల వేతనం నుండి ఈ హెచ్ ఎస్ కోసం 1.5% వేతనాన్ని బలవంతంగా మినహాయింపు చేయడాన్ని మహబూబ్ నగర్ జిల్లా తెలంగాణ స్టేట్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం సోమవారం (టి ఎస్ జి హెచ్ ఎం ఏ) సంఘం అధ్యక్షులు అనంతప్ప, ప్రధాన కార్యదర్శి కే జగదీష్ కుమార్, కోశాధికారి అబ్దుల్ హక్, గౌరవ అధ్యక్షుడు బాలు యాదవ్ తీవ్రంగా ఖండించారు. విధివిధానాలు రూపొందించ కుండా, క్షేత్రస్థాయిలో ఏర్పడ్డ సందేహాలను నివృత్తి చేయకుండా భార్యాభర్తలు ఇద్దరు ఉద్యోగులు అయితే ఎవరు చెల్లించాలి అనే క్లారిటీ ఇవ్వకుండా, ఇంక అనేకమంది ఉపాధ్యాయులు ఈ హెచ్ ఎస్ కొరకు వారి వివరాలు నమోదు చేయకుండానే వేతనం నుండి ఈ హెచ్ ఎస్ పేరిట మీనాయింపు చేయడం సమంజసం కాదని సంఘ సభ్యులు అన్నారు. కావున మినహాయించిన వేతనాన్ని తక్షణమే ఉద్యోగుల ఎకౌంటుకు తిరిగి జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎంప్లాయిస్ ఆరోగ్య పథకం కోసం ఉద్యోగుల మే నెల వేతనం నుండి 1.5% శాతం మూలవేతనంపై మినహాయిస్తూ పేస్లిప్స్ జనరేట్ చేశారన్నారు. ఆరోగ్య పథకానికి సంబంధించి విధివిధానాలు రూపొందించకుండా, కనీసం డ్రాయింగ్ అధికారులకు సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వం దొడ్డిదారిన ఉద్యోగుల వేతనం నుండి మినహాయింపు చేయడాన్ని టీఎస్ జిహెచ్ఎంఏ సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. రాష్ట్రంలోని ఏ హాస్పిటల్స్ లో ఈ ఆరోగ్య పథకాన్ని అమలు చేస్తున్నారనే స్పష్టత లేదు, భార్యాభర్తలు ఉద్యోగులైన సందర్భాలలో, తల్లిదండ్రులు ఉద్యోగులైన సందర్భాల్లో, వేతన మినహాయింపులు ఏ విధంగా చేస్తారనే నిబంధనలు రూపొందించకుండానే ప్రతి ఉద్యోగి నుండి మినహాయింపు చేయడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. ఇది అక్రమమైన చర్యగా భావిస్తున్నామన్నారు. హెల్త్ కార్డులు జారీ చేయకుండా, టీచర్ల సమ్మతి తీసుకోకుండా మినహాయించిన 1.5 శాతం వేతనాన్నీ ఉద్యోగుల ఎకౌంటుకు వెంటనే తిరిగి జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

# పాలమూరు జిల్లాలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు ముమ్మరంగ ఏర్పాట్లు

- విద్యుత్ బల్బుల అలంకరణలో ప్రధాన కూడళ్ళు, స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలు




**జయభేరి, దేవరకద్ర :**

ఉమ్మడి పాలమూరు జిల్లాలో మంగళవారం జరుగు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ముమ్మరంగ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్ళను రంగురంగుల విద్యుత్ బల్బులతో శోభాయమానంగా అలంకరించారు. క్లాక్ టవర్, అశోక్ టాకీస్, బస్టాండ్ చౌరస్తా, తెలంగాణ చౌరస్తా, న్యూ టౌన్, మెట్టుగడ్డ ప్రాంతాలలోని స్వతంత్ర సమర యోధుల విగ్రహాలను విద్యుత్ బల్బులతో అలంకరించారు. అలాగే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని వనపర్తి, గద్వాల్, నారాయణపేట, నాగర్ కర్నూల్ జిల్లాలో కూడా తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

# యాదగిరీశుడి నిత్యరాబడి రూ.59.95 లక్షలు



**జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 01:**

యాదగిరిగుట్ట కొండపైన కొలువైన శ్రీపర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం శివుడికి ప్రీతికరమైన రోజు కావడంతో రామలింగేశ్వరుడికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

**శ్రీనారసింహుడికి నిత్యపూజలు..**

శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. సోమవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం,వెండి జోడి సేవ, స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగే శ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శ్రీనారసింహుడి నిత్యరాబడి..**

శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా సోమవారం రూ.59,95,525 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.1,96,650,బ్రేక్ దర్శనం ద్వారా రూ.1,11,300, శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాల ద్వారా రూ.1,68,000, వీఐపీ దర్శనం ద్వారా రూ.4,44,150,కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.3,79,500,సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.55,528, ప్రసాద విక్రయం ద్వారా రూ.12,03,170, కల్యాణకట్ట ద్వారా రూ.1,05, 000తో పాటు వివిధ శాఖలు, పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.



## కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదోడి సొంతింటి కల నెరవేరింది

**జయభేరి, తుర్కపల్లి, జూన్ 01 :**

కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదోడి సొంతింటి కల నెరవేరిందని సర్పంచ్ బొత్త రాములు అన్నారు. సోమవారం తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామంలో సామూహిక నూతన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ లబ్ధిదారులు సాగర్ల బాలరాజు సబ్బు భవాని, గడిపే పోచమ్మ లకు శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామంలో ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే సహకారంతో ఇండ్లను మంజూరు చేపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జింకల ఎల్లేష్ యాదవ్, ఉపసర్పంచ్ గుమ్మడి బాలరాజు, సీనియర్ నాయకులు పెద్దగొల్ల కిష్టయ్య ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఆలేటి శశ్రీశైలం జూపల్లి తిరుపతి, శాగ బాలరాజు, వార్డు సభ్యులు మాడిశెట్టి మహేందర్, జల్ల గణేష్, గడిపి నరసింహులు, సాగర్ల ఎల్లేష్, రాయన బోయిన చందు, ఆంజనేయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రంలో హమాలీ పని చేసిన సర్పంచ్



**జయభేరి, తుర్కపల్లి, జూన్ 01 :**

తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలోని ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ సందర్శించారు. ఈ సందర్భంగా హమాలీలతో మాట్లాడి వారి కష్టాలను తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని అన్నారు. అనంతరం వారితో పాటు కలిసి అమాలీ పనిని చేశారు. అనంతరం గ్రామంలోని సామూహిక ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని గృహప్రవేశాలను ప్రారంభించారు. ఇందిరమ్మ పథకం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులకు పట్టు వస్త్రాలను అందజేశారు. ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లెంకల గీతారెడ్డి ఉప సర్పంచ్, వార్డు సభ్యులు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మత్స్య పారిశ్రామిక శాఖ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**జయభేరి, తుర్కపల్లి, జూన్ 01 :**

తుర్కపల్లి మండలం మాదాపురం గ్రామంలో మత్స్య పారిశ్రామిక శాఖ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా పాముల మల్లేష్, ఉపాధ్యక్షునిగా రాగుల శేఖర్, ప్రధాన కార్యదర్శిగా యాట గిరి ,డైరెక్టర్లుగా బాలమైన సత్యమ్మ ,పాముల నాగరాణి, ఏడు ముళ్ళ ఆంజనేయులు, లోకుల వెంకటేష్, తిప్పరమైన రామచందర్ , సిద్ధంకి బిక్షపతి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు .ఈ సందర్భంగా నూతన కమిటీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాట పెంటయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఈహెచ్ఎస్ పథకం క్రింద జీతంలో కోతల గందరగోళం



**జయభేరి, తుర్కపల్లి, జూన్ 01 :**

ఈ హెచ్ ఎస్ పథకం కింద జీతంలో కోతలు గందరగోళం సృష్టిస్తున్నాయని ఉద్యోగులకు నగదు రహిత వైద్య సేవలు అందించే పథకంలో భాగంగా ఎటువంటి విధివిధానాలు ప్రభుత్వం రూపొందించక ముందే ఉద్యోగుల జీతాల్లో కోతలు కోయడం అసంబద్ధంగా ఉందని టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షుడు పి బిక్షమయ్య అన్నారు. సోమవారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఇంతవరకు ప్రభుత్వం సూచించిన నిబంధనలేమిటి ,ఆ నిబంధనలకు అంగీకరించిన ఆస్పత్రులేవో తెలియదని అయినప్పటికీ మే నెలలోనే ఉద్యోగస్తుల జీతాల్లో కోతలు వేయడం జరిగిందని అన్నారు. భార్యాభర్తలు ఇద్దరు ఉద్యోగస్తులయితే ఇద్దరి జీతాల్లో కోత కోయడం సరికాదని అన్నారు. ప్రభుత్వం గతంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీల ప్రకారం సక్రమ పద్ధతిలో జీవోలు విడుదల చేసిన తర్వాతనే ఆసుపత్రుల లిస్టు వెలువరించిన తర్వాతనే జీవితంలో కోతలు విధించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# కలెక్టర్ అధికారులతో కలిసి ఇందిరమ్మ ఇండ్లు గృహప్రవేశం

- దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలం, శక్రు తండా గ్రామ పంచాయతీలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లు నల్లగొండ జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి గృహప్రవేశం చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం చేపడతామని చెప్పి తెలంగాణ ప్రజలను మోసం చేసింది. రేవంత్ రెడ్డి అధ్యక్షతన నడుస్తున్న ఈ ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తుంది. దేవరకొండ నియోజకవర్గంలోని ఇండ్లు లేని ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి వారి యొక్క ఆత్మగౌరవాన్ని కాపాడుతామని దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ఇందిరా మహిళా డైరీ భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి

**జయభేరి, పరకాల, జూన్ 01:**

సోమవారం మండల కేంద్రంలో పరకాల ఇందిరా మహిళా డైరీ కి సంబంధించి బల్క్ మిల్క్ చిల్లింగ్ యూనిట్స్ భవనాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు.

# బీఆర్ఎస్ బూత్ కమిటీ సభ్యుల విస్తృత స్థాయి సమావేశం

- మేడ్చల్ నియోజకవర్గం, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఘట్కేసర్ సర్కిల్‌లో బీఆర్ఎస్ బూత్ కమిటీ సభ్యుల విస్తృత స్థాయి సమావేశం




**జయభేరి, ఘట్కేసర్ :**

మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని ఘట్కేసర్ సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీ సభ్యుల విస్తృత స్థాయి సమావేశం అన్నోజీగూడలోని తులిప్స్ గ్రాండ్‌లో ఉమ్మడి ఘట్కేసర్ మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మేడ్చల్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, చామకూర మహేందర్ రెడ్డి,మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బోడుప్పల్ అధ్యక్షులు మంద సంజీవ రెడ్డి హాజరై బీఆర్ఎస్ పార్టీ బలోపేతం, బూత్ స్థాయి కార్యాచరణ, ప్రజా సమస్యలపై పోరాటాలు, రాబోయే రాజకీయ కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలు చర్చించారు. పార్టీ విజయానికి బూత్ కమిటీ సభ్యులే వెన్నెముకగా నిలవాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోచారం మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రెడ్యానాయక్, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, కౌడే పోచయ్య, శ్యామల శ్రీనివాస్, ఆకుల మధుకర్, సురేందర్రెడ్డి, నల్లవెల్లి శేఖర్, రమేష్, పన్నాల కొండల్ రెడ్డి, మాధవరెడ్డి, జగన్మోహన్ రెడ్డి, సామల సందీప్ రెడ్డి, మాజీ ఎంపిటీసీలు,మాజీ సర్పంచులు, మాజీ వార్డ్ మెంబెర్స్ తదితరులు కలిసి పాల్గొన్నారు.



## వార్డ్ మెంబర్ ఆంగోత్ చిట్టీకి ₹30,000 ఆర్థిక సహాయం

- బిఆర్ఎస్ నాయకుడు నేనావత్ కిషన్ నాయక్




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండల పరిధిలోని కర్నాటిపల్లి గ్రామపంచాయతీ ఆంగోత్ సీత్య తండకు చెందిన బిఆర్ఎస్ పార్టీ వార్డ్ మెంబర్ ఆంగోత్ చిట్టీ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ మానవత్వంతో స్పందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇస్తూ, ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం ₹30,000 ముప్పై వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ ఆర్థిక సహాయం అందజేసే కార్యక్రమంలో కిషన్ నాయక్ తో పాటు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు సంతోష్ నాయక్ కంటెస్టెంట్ సర్పంచ్ మునేందర్ రెడ్డి చిత్రం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బోడుప్పల్ రోడ్లకు మహర్దశ

- రూ.32 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం
- అభివృద్ధి పనులను పర్యవేక్షించిన తోటకూర అజయ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు



**జయభేరి, మేడిపల్లి :**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ లో అనేక రోజులుగా పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రెయినేజీ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సేవలు అందించేందుకు మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. సోమవారం బోడుప్పల్ బచ్పన్ స్కూల్ మేడిప్లస్ నుండి అమృత బార్ వద్ద ఉన్న మెడిప్లస్ వరకు నూతనంగా వేయనున్న సీసీ రోడ్డు పనులను మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి అజయ్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా అజయ్ యాదవ్ మాట్లాడుతూ.. గత పాలకుల వైఫల్యం కారణంగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే త్వరితగతిన పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నామని అందులో భాగంగానే రూ.32 లక్షల నిధులతో పనులు ప్రారంభం అవుతున్నాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొత్త చందర్ గౌడ్, సింగిరెడ్డి పద్మారెడ్డి, బొమ్మక కళ్యాణ్ కుమార్, కొత్త దుర్గమ్మ, చీరాల నరసింహ, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, సుమన్ నాయక్, సీసా వెంకటేష్ గౌడ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హరినాథ్ రెడ్డి, సీనియర్ నాయకులు కొత్త ప్రభాకర్ గౌడ్, కుర్రి శివశంకర్, బోడుప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అసర్ల బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

## మల్లారెడ్డి ని పరామర్శించిన సోదా రామకృష్ణ



**జయభేరి, పరకాల, జూన్ 01:**

సోమవారం నడికూడ మండల అధ్యక్షుడు మాజీ ఎంపీటీసీ పర్నేం మల్లారెడ్డి అత్తగారైన కీ,,శే,, ఎన్ రెడ్డి (చేనుమల్ల) యశోద నిన్నటి రోజున అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేసిన పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులుసోదా రామకృష్ణ. ఈ కార్యక్రమంలో రామకృష్ణ తో పాటుగా సమన్వయ కమిటీ సభ్యులు పసుల రమేష్, బండి సదానందం గౌడ్, మార్క రఘుపతి గౌడ్, ఏకు రాజు, నాయకులు జెమిని తదితరులు పాల్గొన్నారు.

# మా కొలువులు మాగ్గావాలె..

- పుష్కరాల తెలంగాణ..
- అష్టకష్టాల నుంచి అభివృద్ధి దాకా...

జయభేరి, హైదరాబాద్, జూన్1 :



ఆదిలాబాద్ అడవుల నుంచి ఖమ్మం గుమ్మం దాకా, పాలమూరు పల్లెల నుంచి మెతుకుసీమ గడపల దాకా, ఓరుగల్లు కోటల నుంచి హైదరాబాద్ గల్లీల దాకా వినిపించిన ఆకాంక్ష తెలంగాణ. ఇందూరు, కరీంనగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల ప్రజలు అలుపెరగక పోరాడి సాధించుకున్న గడ్డ ఇది. వందల వేలమంది చావును ముద్దాడి, తమ ఊపిరిని ధారపోసి తెచ్చుకున్న స్వరాష్ట్రం త్యాగాల పునాదిపై నిర్మితమైంది. 'మా కొలువులు మాగ్గావాలె' అనే నినాదం ఉవ్వెత్తున ఎగసి, దశాబ్దాల పాటు రగులుతూనే ఉంది. ఆరు దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానం చివరకు 2014 జూన్ రెండో తేదీన సఫలీకృతమై, భారతదేశపు 29వ రాష్ట్రంగా తెలంగాణ ఉద్భవించింది. ఈ సువర్ణ అధ్యాయం వెనుక దాగి ఉన్న కీలక ఘట్టాలను, మైలురాళ్లను స్మరించుకోవడం మన బాధ్యత.నిజాం పాలనలో ఉన్న ఈ ప్రాంతం 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ స్టేట్‌గా భారత యూనియన్‌లో విలీనమైంది. అనంతరం 1956 నవంబర్ 1న భాషాప్రయుక్త రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆంధ్ర రాష్ట్రంతో విలీనం చేయబడి ఆంధ్రప్రదేశ్‌లో భాగమైంది. భౌగోళిక, సంస్కృతిక వైవిధ్యం కలిగిన ఈ ప్రాంతం విలీనం కావడం వెనుక ఎన్నో ఆశలు, ఆకాంక్షలు దాగి ఉండేవి. అధికార పంపిణీలో సమతుల్యత కోసం నాటి మేధావులు పెద్ద మనుషుల ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో జనాభా నిష్పత్తి పాటించాలని, తెలంగాణలో స్థిరపడాలంటే 12 ఏళ్ల నివాస నిబంధన ఉండాలని నిర్ణయించారు. కేబినెట్‌లో 40 శాతం మంత్రి పదవులు తెలంగాణకు కేటాయించడం, ముఖ్యమంత్రి ఆంధ్ర ప్రాంతం వారైతే ఉప ముఖ్యమంత్రి తెలంగాణ వారై ఉండాలని కచ్చితమైన షరతులు విధించారు.ఈ ఒప్పందాలు కాగితాలకే పరిమితం కావడం తెలంగాణ సమాజంలో తీవ్రమైన అసహనాన్ని, నిరసనను రేకెత్తించాయి. తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా నిధులు పక్కదారి పట్టడం ఆందోళనలను మరింత తీవ్రతరం చేశాయి. వశిష్ట భార్గవ కమిటీ వెల్లడించిన గణాంకాల ప్రకారం 1956 నుంచి 1968 మధ్య కాలంలో రూ. 28.3 కోట్ల తెలంగాణ మిగులు నిధులు ఆంధ్రా ప్రాంతానికి మళ్లించబడ్డాయి. ముల్కీ నిబంధనలను కాలరాస్తూ 4500 మంది ఆంధ్రా ఉద్యోగులు తెలంగాణలో పని చేయడం నిరుద్యోగ యువతను ఆవేదనకు గురిచేసింది. ఈ వివక్షపై 1969లో జరిగిన తొలి దశ ఉద్యమం మర్రి చెన్నారెడ్డి సారథ్యంలో రాజకీయ రూపం దాల్చినా, అది ఆశించిన లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. ఈ వైఫల్యం తర్వాత ఉద్యమ తీవ్రత కొంతకాలం తగ్గినట్లు కనిపించినా, నిప్పురవ్వలు లోలోపల రగులుతూనే ఉన్నాయి.కొత్త శతాబ్దంలో తెలంగాణ ఆకాంక్షలు మళ్లీ ఉధృతమయ్యాయి. 2001లో కేసీఆర్ స్థాపించిన తెలంగాణ రాష్ట్ర సమితి ప్రత్యేక రాష్ట్ర సాధనను ప్రధాన ఎజెండాగా తీసుకుంది. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో జతకట్టినప్పటికీ ఆశించిన ఫలితం రాకపోవడంతో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి టీఆర్ఎస్ వైదొలిగింది. 2006లో కేంద్ర మంత్రి పదవికి, ఎంపీ పదవికి కేసీఆర్ రాజీనామా చేసి, ఉపఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలవడం ద్వారా తెలంగాణ సెంటిమెంట్‌ను మరోసారి దేశం దృష్టికి తీసుకెళ్లారు.

2008లో కూడా ఇదే ఒరవడిని కొనసాగించడం ద్వారా ఉద్యమ తీవ్రతను చాటారు. ప్రజల నాడిని పట్టుకున్న కేసీఆర్, రాజకీయ ఎత్తుగడలతో ఉద్యమాన్ని మలుపు తిప్పడంలో విజయం సాధించారు.2009 నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఉద్యమ గమనాన్ని ఒక్కసారిగా మార్చేసింది. 'తెలంగాణ వచ్చుడో, కేసీఆర్ సచ్చుడో' అనే నినాదం మారుమోగుతుండగా, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. ఈ దీక్షా ఫలితంగా 2009 డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు అప్పటి కేంద్ర హోంమంత్రి చిదంబరం ప్రకటించారు. ఆ తర్వాత సమైక్యాంధ్ర ఉద్యమాలతో పరిస్థితులు సంక్లిష్టంగా మారినా, శ్రీకృష్ణ కమిటీ నివేదిక అనంతరం రాజకీయ పరిణామాలు వేగంగా సాగాయి. చివరకు 2013 అక్టోబర్ 3న కేంద్ర మంత్రివర్గం తెలంగాణ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పార్లమెంటు వేదికగా సుదీర్ఘ చర్చల తర్వాత, 2014 ఫిబ్రవరి 18న లోక్ సభలో, ఫిబ్రవరి 20న రాజ్యసభలో తెలంగాణ బిల్లు ఆమోదం పొందింది. మలిదశ ఉద్యమంలో ఎందరో త్యాగధనులు తమ ప్రాణాలను అర్పించారు. 2009 నవంబర్ 29 నుంచి డిసెంబర్ 3 వరకు ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. కేసీఆర్ అరెస్ట్‌కు నిరసనగా ఎల్బీ నగర్ చౌరస్తాలో శ్రీకాంతాచారి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. మూడు రోజుల పాటు మృత్యువుతో పోరాడి డిసెంబర్ 3న అమరుడయ్యారు. మలిదశ ఉద్యమంలో తొలి అమరుడిగా చరిత్రలో నిలిచిన శ్రీకాంతాచారి త్యాగం ఎందరినో కదిలించింది. డిసెంబర్ 23న ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుకు వ్యతిరేకంగా సీమాంధ్రలో ఉద్యమాలు పెరగడం, అక్కడ ఎంపీలు రాజీనామా చేయడం వంటి పరిణామాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రక్రియను తాత్కాలికంగా హోల్డ్‌లో పెట్టింది. అయినప్పటికీ వెనకడుగు వేయకుండా తెలంగాణ సమాజం పోరాటాన్ని కొనసాగించింది.కాంగ్రెస్, బీజేపీ మద్దతుతో పార్లమెంటులో ఆమోదం పొందిన ఈ బిల్లుకు మార్చి 1న రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆమోద ముద్ర వేయడంతో గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. అన్ని చట్టపరమైన ప్రక్రియలు పూర్తి చేసుకుని 2014 జూన్ 2న తెలంగాణ స్వయంప్రతిపత్తి కలిగిన రాష్ట్రంగా ఆవిర్భవించింది. ఆ రోజు నుంచి నేటి వరకు తెలంగాణ ప్రజానీకం ప్రతి ఏటా జూన్ 2ను ఆవిర్భావ దినోత్సవంగా ఘనంగా జరుపుకుంటున్నారు. ప్రతి ఏటా అమరవీరుల స్తూపం వద్ద ముఖ్యమంత్రి నివాళులు అర్పించి, జాతీయ జెండాను ఆవిష్కరించడం ఆనవాయితీగా మారింది. ఈ ఉత్సవాలు కేవలం సంబరాలు మాత్రమే కాదు, సాధించిన ప్రగతిని సమీక్షించుకునే వేదికలు.2026 నాటికి తెలంగాణ పదకొండు ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని, పన్నెండవ ఏట అడుగుపెట్టింది. వేలాది మంది త్యాగధనుల కన్నీటి చుక్కలే నేటి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రానికి ప్రాణం పోశాయని, ఈ ప్రస్థానం సమున్నతమైనదని గతం చెబుతున్న సత్యం. గడిచిన కాలంలో రాష్ట్రం సాధించిన ప్రగతి, ఎదుర్కొన్న సవాళ్లు రాబోయే తరాలకు దిక్సూచిగా మారుతున్నాయి. పరిపాలనా సంస్కరణల ద్వారా 33 జిల్లాల ఏర్పాటు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధి వంటివి అద్భుతమైన మైలురాళ్లు. తెలంగాణ కీర్తిని దశదిశలా చాటిచెప్పే దిశగా రాష్ట్ర ప్రగతి నిరంతరం కొనసాగుతూనే ఉంది. ఈ స్ఫూర్తితోనే భావి తరాలు అభివృద్ధి బాటలో మరింత వేగంగా దూసుకుపోవాలని ఆకాంక్ష.



## నాచారం IICT వద్ద రోడ్డు విస్తరణకు చర్యలు

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జయభేరి, ఉప్పల్ :

నాచారం ప్రధాన రహదారిపై హబ్సిగూడ నుంచి నాచారం వైపు వెళ్లే మార్గంలో ఉన్న IICT ఇన్‌స్టిట్యూట్ , IICT క్వార్టర్స్ మధ్యనున్న బాటిల్‌నెక్ రోడ్డు సమస్య పరిష్కారానికి కీలక చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ సమస్యపై గత కొంతకాలంగా నిరంతరం కృషి చేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రయత్నాల ఫలితంగా, ప్రస్తుతం ఉన్న రహదారికి ఇరువైపులా సుమారు 20 అడుగుల చొప్పున స్థలం ఇవ్వడానికి సానుకూలంగా ఉన్నట్లు IICT డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అయితే, పెరుగుతున్న జనాభా, విద్యాసంస్థల వాహనాల రద్దీ, అలాగే చర్లపల్లి రైల్వే స్టేషన్ ఏర్పాటుతో ఈ ప్రాంతంలో రోజురోజుకు ట్రాఫిక్ ఒత్తిడి మరింత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ ప్రకారం రహదారి మధ్య నుంచి తగిన వెడల్పుతో పూర్తి స్థాయి రోడ్డు విస్తరణ చేపట్టాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి IICT డైరెక్టర్‌ను కోరారు. ఈ ప్రతిపాదనపై కేంద్ర కార్యాలయానికి నివేదిక పంపించి తదుపరి చర్యలు చేపడతామని డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగించి, నాచారం-హబ్సిగూడ మార్గాన్ని ట్రాఫిక్ రహితంగా మార్చేందుకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కృషి కొనసాగుతోంది.

## వాటర్ వర్క్స్ అధికారులతో సమీక్ష సమావేశం

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో తాగునీటి సరఫరా, నీటి ఒత్తిడి సమస్యలు, కొత్త పైప్‌లైన్‌ల ఏర్పాటు, లీకేజీల నివారణ, మురుగునీటి నిర్వహణ తదితర అంశాలపై వాటర్ వర్క్స్ ED పంకజా, జీఎం సంతోష్‌తో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా వేసవి కాలంలో నీటి కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని, నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. అలాగే పాత పైప్‌లైన్‌ల కారణంగా తరచూ ఏర్పడుతున్న లీకేజీలను వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో కొత్త పైప్‌లైన్‌ల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మురుగునీటి సమస్యలు అధికంగా ఉన్న కాలనీలలో ప్రత్యేక చర్యలు తీసుకొని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు.

## పల్లె రాజ్ కుమార్ గౌడ్ కి జన్మదిన శుభాకాంక్షలు

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ పల్లె రాజ్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి పాల్గొన్న బీసీ జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ గజ్జెల సత్యరాజ్ గౌడ్.. ఈ సందర్భంగా రాజ్ కుమార్ గౌడ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేసి శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నేర్ధం భాస్కర్ గౌడ్, కోలా రవికుమార్ గౌడ్, సీతారామ కాలనీ అధ్యక్షులు గూడూరు రమేష్ గౌడ్ సాయిజెన్ శేఖర్, మెడల మల్లికార్జున గౌడ్, గంధం నాగేశ్వరరావు, అమిత్, లక్ష్మీనారాయణ, కైలాష్ పతి గౌడ్,బూత్కూరి నవీన్ గౌడ్, జట్ట కిషోర్, నరసింహ బొల్లు, కట్ట బుచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ప్రిన్సిపల్ సదాశివ శర్మకు "ఆచార్య రత్న" పురస్కారం

- ప్రతి ఏటా విద్యారంగానికి ఉత్తమ సేవలందించి, విశేష కృషి చేసే వారికి అందించే "ఆచార్య రత్న" పురస్కారం




జయభేరి, హైదరాబాద్ :

ఈ విద్యా సంవత్సరానికి విశ్రాంత ప్రిన్సిపల్ సదాశివ శర్మకు లభించింది. ఆదివారం నెల్లూరులో జరిగిన అఖిల భారత బ్రాహ్మణ ఘోష సభలో అఖిల భారత బ్రాహ్మణ ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు అవధానం సాయి కుమార్ చేతుల మీదుగా శర్మ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. శర్మ విద్యా రంగానికి అందించిన విశేష సేవలకు , విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దినందుకు గాను గౌరవ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నట్లు సాయికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శర్మకు పలువురు విద్యావేత్తలు, మేధావులు అభినందనలు తెలియజేశారు.



## రిమాండ్‌కు పంపిస్తూ ఉత్తర్వులు జారీ

జయభేరి, హయత్‌నగర్ :

హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధిత సమయాల్లో పాన్ షాప్ నిర్వహిస్తున్న సయ్యద్ ఇమ్రాన్ రహీమ్ (35), తండ్రి సయ్యద్ అలీ, నివాసం జీ స్కూల్ ప్రాంతం, హయత్‌నగర్‌పై పోలీసులు చర్యలు చేపట్టారు. నిషేధిత సమయాల్లో పాన్ షాప్ నిర్వహించినందుకు అతనిపై సెక్షన్ 21/76 సీపీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి, STC No. 3411/2026 కింద 9వ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం న్యాయమూర్తి ఆర్ల భరత్ రెడ్డి నిందితుడిని 02 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం నిందితుడిని చెర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించారు. ప్రజలు ప్రభుత్వ నిబంధనలు, పోలీసు శాఖ సూచనలను పాటిస్తూ నిర్ణీత సమయాల్లో మాత్రమే వ్యాపార కార్యకలాపాలు నిర్వహించాలని హయత్‌నగర్ పోలీసులు సూచించారు.

## ముస్తాబాద్ మండల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన జ్యోతి

జయభేరి, రాజన్న సిరిసిల్ల :

ముస్తాబాద్ మండల నూతన ఎస్సైగా జి.జ్యోతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్సై గణేష్ సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌కు బదిలీ కావడంతో, ఆయన స్థానంలో జ్యోతి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతలను కాపాడటంతో పాటు, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## కనుల పండుగగా బీరప్ప స్వామి కల్యాణం

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య,ఎగ్గే మల్లేశం,క్యామ మల్లేశం..

జయభేరి, మేడిపల్లి :





బోడుప్పల్ సర్కిల్ ఫీర్జాదిగూడ మిని ట్యాంక్ బండ్ వద్ద సోమవారం శ్రీ బీరప్పస్వామి, కామరాతిదేవిల కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. కురుమ కుల ఆచారం మేరకు ఒగ్గు కళాకారులు ఒగ్గు కథ చెప్పారు. ఆలయం నుంచి స్వామివారిని ఉదయం పదిన్నర గంటలకు గద్దెపైకి చేర్చి కల్యాణం నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన తెలంగాణ రాష్ట్రప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య,తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు ఎగ్గే మల్లేశం,కురుమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లేశం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల ఆచార వ్యవహారాలను సంరక్షించుకునేందుకు కురుమలు తరచూ ఇలాంటి ఉత్సవాలు జరపడం అభినందనీయమని అన్నారు. అదేవిధంగా బీరప్పస్వామి పండగకు పురాతన కాలం నుంచి ఎంతో ప్రాధాన్యత ఉందని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో కొమరవెళ్ళి దేవస్థానం మాజీ చైర్మన్ చేవెళ్ళి సంపత్ కురుమ, దొడ్డి కొమురయ్య ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ కంకల ఏలేందర్ కురుమ,సభ్యులు మంగ వెంకటేష్ కురుమ, మరాటి మల్లేష్ కురుమ,గౌరిగె నర్సింహ్మ కురుమ,యూత్ కాంగ్రెస్ నాయకులు ఆసర్ల బీరప్ప కురుమ,తెలంగాణ సిద్దు కురుమ,నిర్వాహకులు జోగు సోమలింగం కురుమ, జోగు సోమేష్ కురుమ,మరాటి శివేందర్ కురుమ,కేమిడి సత్యనారాయణ కురుమ,నకిర్త అమర్నాద్ కురుమ,బాల్దె మహేందర్ కురుమ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ నిర్లక్ష్యం.. ప్రజలకు ఇబ్బందులు

- గుంతలు తవ్వి వదిలేసిన అధికారులు, కాంట్రాక్టర్

జయభేరి, మేడిపల్లి :





బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్ మల్లకార్జున నగర్‌లో 11KV భూగర్భ విద్యుత్ కేబుల్ పనులు స్థానికులకు ఇబ్బందికరంగా మారాయి. విద్యుత్ కేబుల్ ఏర్పాటు కోసం రోడ్లపై తవ్విన గుంతలను పూడ్చకుండా, కేబుల్ పనులను మున్సిపల్ శాఖ, HMWS&SB అధికారుల సమన్వయం లోపంతో అధికారులు మరియు కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఇరుకైన వీధుల్లో ఇళ్ల ముందే పెద్ద గుంతలు ఉండటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు రాకపోకలు సాగించడంలో ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో గుంతలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా తవ్విన మట్టిని, రోడ్డు శిథిలాలను అక్కడే వదిలేయడంతో దుమ్ము, ధూళి సమస్యలు కూడా పెరిగాయని ప్రజలు చెబుతున్నారు. ఒకవైపు వాటర్ లైన్ పక్కనే 11KVకేబుల్ వేయడంపై అనుమానాలు వ్యక్తమవుతుండగా, మరోవైపు పనులు అసంపూర్తిగా వదిలేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శిస్తున్నారు. తక్షణమే విద్యుత్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్ స్పందించి గుంతలను పూడ్చి, రోడ్లను యథాస్థితికి తీసుకురావాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.



# ఫ్యాషన్, బిజినెస్‌లోనూ దూసుకుపోతున్న స్టార్..



నటి తమన్నా భాటియా ఒక ప్రత్యేక సందర్భం కోసం జారా బ్రాండ్‌కు చెందిన పసుపు రంగు మాక్సీ డ్రెస్‌ను ఎంచుకున్నారు. బాడీకి ఫిట్‌గా ఉండే బోడిస్, భుజాల మీద సున్నితమైన టైఅప్ స్ట్రాప్స్, మరియు కింద వైపు లేయర్డ్ రఫుల్స్ ఈ డ్రెస్‌కు ఒక అందమైన రూపాన్ని ఇచ్చాయి. లేత పసుపు రంగు వేసవికి ఎంతో హాయిగా, ఉల్లాసంగా అనిపిస్తుంది. కదిలే ప్రతి అడుగులోనూ డ్రెస్ అందించే ఫ్లోయి ఎఫెక్ట్ ఈ దుస్తులకు ఒక అదనపు ఆకర్షణను జోడించింది. ఆమె తన లుక్‌ను పూర్తి చేయడానికి సుమారు 88 వేల రూపాయల విలువైన క్రిస్టియన్ లూబౌటిన్ మిస్ జి పంప్స్ ధరించారు. ఈ న్యూడ్ హీల్స్ ఆమె ఎత్తును పెంచడమే కాకుండా, దుస్తులకు ఒక పరిపూర్ణమైన ముగింపును ఇచ్చాయి. నటనకు మాత్రమే పరిమితం కాకుండా, 'తమన్నా ఫైన్ జ్యువెలరీ' పేరుతో సొంత వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకోవడంలో ఆమె ఎంతో ఉత్సాహం చూపుతున్నారు. తన బ్రాండ్‌లోని వజ్రాలు, ప్రత్యేకమైన ఆభరణాలను తన పబ్లిక్ అప్పీయరెన్స్‌లలో ధరించడం ద్వారా, ఆమె తన వ్యాపార గుర్తింపును పెంపొందించుకుంటున్నారు. విపరీతమైన ఆడంబరాలు లేకుండా, అత్యంత హుందాతనంతో కూడిన ఆభరణాలను ఎంచుకోవడం ఆమె ప్రత్యేకత. ఆమె మేకప్ మరియు సింపుల్ హెయిర్ స్టైల్, ఆమె ధరించిన ఆభరణాల మెరుపును మరింతగా హైలైట్ చేశాయి.



# దుష్టశిక్షణలో స్వయంభూ

నిఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'స్వయంభూ'. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నారు. సోమవారం హీరో నిఖిల్ పుట్టినరోజు సందర్భంగా స్పెషల్ వీడియోను విడుదల చేశారు. ఇందులో యుద్ధవీరుడి పాత్ర కోసం నిఖిల్ చేసిన కఠోర శ్రమను చూపించారు. ఈ సినిమా కోసం నిఖిల్ ప్రొఫెషనల్ ట్రెయినర్ల పర్యవేక్షణలో కత్తియుద్ధం, మార్షల్ ఆర్ట్స్ వంటి విద్యల్లో శిక్షణ తీసుకున్నారని మేకర్స్ తెలిపారు. వీడియో చివరలో చూపించిన విజువల్స్ ఆకట్టుకున్నాయి. వీటిలో యుద్ధ కవచం ధరించిన నిఖిల్ శత్రువులపై విరుచుకుపడటం, అగ్ని జ్వాలల మధ్య పోరాటాలు రోమాంచితంగా అనిపించాయి. ఈ సినిమాలో నిఖిల్..చోళ యుద్ధ వీరుడి పాత్రలో కనిపించనున్నారని సమాచారం. ఓ సామాన్యుడు చారిత్రక పురుషుడిగా మారే వైనం కథలో ఆసక్తికర అంశమని చెబుతున్నారు. త్వరలో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదలకానుంది. సంయుక్త, నభానటేష్ తదితరులు కీలక పాత్రల్ని పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, నిర్మాతలు: భువన్, శ్రీకర్, రచనదర్శకత్వం: భరత్ కృష్ణమాచారి.

# పెద్ది అంటే ఓ పడిలేచే కెరటం




'ఎన్నో కథలు వింటూ ఉంటాం. కొన్ని నచ్చుతాయ్. కొన్ని ఆశ్చర్యపరుస్తాయి. పెద్ది కథ వినగానే నా హృదయాన్ని తాకింది. బుచ్చిబాబు దీన్ని ఒక సినిమా కథలా చెప్పలేదు. ఒక వ్యక్తి ప్రయాణంలా నేరేట్ చేశాడు. 'పెద్ది' అంటే ఓ పడిలేచిన కెరటం. నటుడిగా నాకెంతో సంతృప్తినిచ్చిన సినిమా ఇది. మగధీర, రంగస్థలం, ఆర్‌ఆర్‌ఆర్ చేస్తున్నప్పుడు ఎలాంటి అనుభూతి కలిగిందో ఈ సినిమా చేస్తున్నప్పుడు అదే ఫీలింగ్. రాసిపెట్టుకోండి.. ఇండియాలోని టాప్4 డైరెక్టర్లలో బుచ్చిబాబు పేరుంటుంది. ఇందులో పనిచేసిన వారంతా ప్రాణం పెట్టారు. 'పెద్ది'కి బిగ్ పిల్లర్ ఏఆర్ రెహమాన్. అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారాయన. 'పెద్ది'గాడి ఆత్మగౌరవాన్ని మీరంతా ఉన్నతస్థాయికి తీసుకెళ్లాలని కొండపై ఉన్న దుర్గమ్మను కోరుకుంటున్నా' అని రామ్‌చరణ్ అన్నారు. ఆయన హీరోగా రూపొందిన పీరియాడిక్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది'. జాన్వీ కపూర్ కథానాయిక. బుచ్చిబాబు సానా దర్శకుడు. వెంకటసతీశ్ కిలారు నిర్మాత. ఈ నెల 4న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా సోమవారం విజయవాడలో జరిగిన సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో రామ్‌చరణ్ మాట్లాడారు. డైరెక్టర్ బుచ్చిబాబు సానా మాట్లాడుతూ 'ఒక్క సినిమా చేసిన నాలాంటి దర్శకుడ్ని నమ్మి అవకాశం ఇచ్చిన రామ్‌చరణ్‌ని జీవితంలో మర్చిపోలేను. 'పెద్ది' కమర్షియల్ సినిమా మాత్రమే కాదు. పడిలేచిన ఓ వ్యక్తి కథ ఇది. ఓ ఆటగాడి ప్రయాణం. 350కోట్లు ఖర్చుపెట్టి నిర్మాతలు ఈ సినిమా తీశారు. అందరి నమ్మకాన్నీ 'పెద్ది' నిజం చేస్తాడని నమ్మకంతో ఉన్నా' అని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంకా జాన్వీ కపూర్, నిర్మాతలు వెంకటసతీశ్ కిలారు, వై.రవిశంకర్, జగపతిబాబు, దివ్యేందు శర్మ, రత్నవేల్, అనంతశ్రీరామ్, ఏపీ రాజకీయప్రముఖులు కందుల దుర్గేష్, కేశినేని నాని కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# కాక్‌టెయిల్ 2 కోసం 15 కోట్లు?

సంసిద్ధంగా ఉన్నవారినే అదృష్టం వరిస్తుందంటారు. ఈ మాటలు అగ్ర కథానాయిక రష్మిక మందన్న విషయంలో నిజమనిపిస్తాయి. కన్నడ చిత్రం 'కిరిక్ పార్టీ'తో (2016) సినీ ప్రయాణాన్ని మొదలుపెట్టిన ఈ కూర్గ్ సొగసరి పదేళ్ల ప్రస్థానంలో జాతీయస్థాయిలో తిరుగులేని పేరుప్రఖ్యాతులు సంపాదించుకుంది. నటిగా ప్రతీ సినిమాలో పరిణతి సాధిస్తూ, పాత్రలపరంగా సవాళ్లను స్వీకరిస్తూ కెరీర్‌లో దూసుకుపోతున్నది. ముఖ్యంగా 'పుష్ప' ఫ్రాంచైజీతో రష్మిక మందన్న పేరు దేశవ్యాప్తంగా మార్మోగిపోయింది. ప్రస్తుతం దక్షిణాదితో పాటు హిందీలో కూడా ఆమెకు భారీ చిత్రాల్లో అవకాశాలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో రష్మిక మందన్నకు పెద్ద మొత్తంలో పారితోషికాలను ఆఫర్ చేస్తున్నారని ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తున్నది. తాజా సమాచారం ప్రకారం హిందీ చిత్రం 'కాక్‌టెయిల్2'కోసం రష్మిక మందన్న 15కోట్ల రెమ్యునరేషన్ తీసుకుందని జాతీయ మీడియాలో వార్తలొస్తున్నాయి. షాహిద్‌కపూర్, కృతిసనన్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటించిన రొమాంటిక్ డ్రామా 'కాక్‌టెయిల్2' ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకురానుంది. 'పుష్ప' ఫ్రాంచైజీతో పాటు యానిమల్, ఛావా వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలు బాలీవుడ్‌లో రష్మిక మందన్న స్థానాన్ని సుస్థిరం చేశాయి. ఈ నేపథ్యంలో ఆమెకు భారీ పారితోషికాలు అందివ్వడానికి బాలీవుడ్ నిర్మాతలు సిద్ధంగా ఉన్నారని చెబుతున్నారు. ప్రస్తుతం రష్మిక మందన్న తెలుగులో రణబాలి, మైసా చిత్రాల్లో నటిస్తున్నది.

# చిల్ అవుట్ మూడ్‌లో ప్రియాంకా చోప్రా.. స్విమ్మింగ్ పూల్‌లో సరదాగా..



స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళిమహేశ్ బాబు కాంపౌండ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ వారణాసి (Varanasi). గ్లోబల్ అడ్వెంచరస్ ప్రాజెక్టుగా వస్తోన్న ఈ మూవీలో బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్వీ రాజ్ సుకుమార్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. మాధవన్, ప్రకాశ్ రాజ్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. ప్రియాంకా చోప్రా వారణాసి షూటింగ్ కోసం హైదరాబాద్‌లో ఉన్న విషయం తెలిసిందే.

ఎప్పుడూ షూటింగ్ షెడ్యూల్స్‌తో బిజీ బిజీగా గడిపే ఈ భామ కాస్త రిలాక్సింగ్ మూడ్‌లోకి వెళ్లిపోయింది. షూట్ బ్రేక్ టైంలో ఆదివారం సరదాగా స్విమ్మింగ్ చేసింది. బికినీలో ఓ వైపు హొయలుపోతూ.. మరోవైపు అందాలు ఆరబోస్తూ కుర్రకారుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. లాంగ్ గ్యాప్ తర్వాత హైదరాబాద్‌లో ఇలా కనిపించి నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పుడీ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. వారణాసి చిత్రాన్ని శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం రెండు పార్టులుగా రాబోతుంది. ఈ మూవీ ఫస్ట్ పార్ట్‌ను 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయన్నట్టు ఇప్పటికే ప్రకటించింది టీం. సెకండ్ పార్ట్ 2029లో వస్తుందని వార్తలు రాగా.. రాజమౌళి టీం రాబోయే రోజుల్లో ఏదైనా క్లారిటీ ఇస్తుందేమో చూడాలి.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com**, **www.jayabheridaily.com**